కొత్తపల్లి

కథల పుస్తకం 37 వ భాగం



కొత్తపల్లి-తెలుగుపిల్లల ఈ(e) మాసపత్రిక మే 2011

మూలం: http://kottapalli.in/2011/05/welcome

సంపాదకులు: నారాయణ

ముఖచిత్రం: వీరాంజనేయులు

అక్షర కూర్పు: కొత్తపల్లి ఇంక్‌జెట్‌ప్రెస్, చెన్నేకొత్తపల్లి,అనంతపురం జిల్లా.

ముద్రితప్రతి వెల:

ప్రతి ఒక్కింటికి రూ. 20/-

పన్నెండు భాగాల ప్రత్యేక వెల: రూ. 240/-

ఇంటర్నెట్‌లో ఈ పుస్తకాన్ని వివిధ ఫార్మాటుల్లో ఉచితంగా చదవవచ్చు, డౌన్లోడు చేసుకోవచ్చు, అవసరమనిపిస్తే మీ అంతట మీరే ముద్రించుకోవచ్చు!

కాపీరైటు: ఈ పుస్తకంలోని ఏ అంశాన్నైనా ఎవరైనా తమ వాణిజ్యేతర కార్యకమాలలో పూర్తిగా ఉచితంగా, స్వేచ్ఛగా ఉపయోగించుకోవచ్చు. కేవలం ఆయా రచయితలకు, కొత్తపల్లి పత్రికకు వాటిని ఆపాదిస్తే సరి. వివరాలకు చూడండి: http://www.creativecommons.org వారి non-commercial, share alike license.

కొత్తపల్లిప్రచురణలు

యంఆర్‌వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి- 515 101, అనంతపురం జిల్లా.

ఫోను: 08559 240222 ఇ-మెయిలు: team@kottapalli.in

విషయ సూచిక

ముందుమాట

శ్రమశక్తి...సంపాదకీయం...2

ధారావాహిక

నీతిచంద్రిక...చిన్నయసూరి...5

పిల్లలు రాసిన కథలు

ఎవరుగొప్ప?...నికిత...13

పల్లెమనిషి...ప్రగతి...15

చీమ-అగ్గిపుల్ల...నందన...19

వరాలపాము...ఆమని...21

కొండముసవ...మధుసూదన...23

చదువు...భాగ్యలక్ష్మి...26

పెద్దలు రాసిన కథలు

కాకి...ఆదూరిహైమవతి...29

పారినఉపాయం...రాధామండువ... 35

ఈగకథ...చక్రి...39

అమ్మచెట్టు...బొమ్మిడి జగదీశ్వరరావు...42

గమ్యం...నాగలక్ష్మి...46

అనువాద కథ

గులాబీ...సుధారాణి...50

బొమ్మకు కథ

కాపాడండి...నారాయణ...55

పాటలు

డుర్రుచ్చి... బాలాంత్రపురజనీకాంతరావు...59

యాభైఆరు...జైసీతారాం...60

అక్షరాలలో ఉంది...దివ్యమీన...62

అవీ-ఇవీ

పదరంగం-3...దేవి...63

బొమ్మకుకథరాద్దాం...లలిత...64

శ్రమశక్తి

అనగా అనగా ఒక ఇల్లు, దాన్ని ఆనుకొని ఒక చీమల పుట్ట ఉండేవి.

ఆ చీమల పుట్టలో చాలా రాణీ చీమలూ, వాటికి పదింతలు మగ చీమలూ, వాటికి వందరెట్లు సేవక చీమలూ ఉండేవి. మగ చీమలు సేవక చీమలకు పనులు నేర్పిస్తూ ఉండేవి. సేవక చీమలన్నీ అవి ఏమి చెబితే అవి శ్రద్ధగా చేస్తూ ఉండేవి.

ఒకసారి ఆ ఇంటావిడ ఘుమఘుమలాడే పాయసం చేసింది. ఆ వాసనకే చీమలన్నీ మత్తెక్కిపోయాయి.

"ఎక్కడ, పాయసం? ఏది, పాయసం?" అరిచాయి రాణీ చీమలు. "పోండి, వెళ్ళి వెతకండి" ఆజ్ఞలు జారీ చేశాయి మగచీమలు- ఇల్లంతా వెతకటం మొదలుపెట్టాయి, సేవకచీమలు.

అయితే ఆ ఇంటావిడ చాలా తెలివైనది- ఆమెకు తెలుసు, ఈ చీమల ప్రతాపం. అందుకని ఆవిడ ఒక ప్లేటులో నీళ్ళు పోసి, దాని మధ్యలో ఒక గ్లాసును బోర్లించింది. ఒంటిస్తంభం మేడలాగా ఉన్న ఆ గ్లాసుమీద పాయసం గిన్నెను పొందికగా కూర్చోబెట్టింది.

సేవక చీమలు హడావిడిగా వెళ్ళి వెతికాయి. ప్లేటు మీదికి ఎక్కి, నీళ్ళ అంచుల వెంబడే తిరిగి చూశాయి: "ఊహుఁ..వేరే దారి లేదు- పాయసం గిన్నెను అందుకోవాలంటే నీళ్ళలోకి

దూకాల్సిందే-"

"నీళ్ళలోకి దూకద్దులే, ఊరికే చచ్చిపోతాం" అని కొన్ని చీమలు వెనక్కి వెళ్ళాయి, ఉత్త చేతులతో. రాణీ చీమలకు కోపం వచ్చి వాటిని అంతం చేసేశాయి.

మిగిలిన సేవక చీమలకు అర్థమైంది- 'వేరే దారి లేదు- దూకాల్సిందే' అని.

అంచు వెంబడి ఉన్న చీమలు ముందుగా దూకాయి, నీళ్ళలోకి. వాటి వెనకనే రెండో వరస- వెంటనే మూడోవరస- ఇట్లా వందలాది వరసల చీమలు నీళ్ళలోకి దూకి, చచ్చి తేలాయి నీళ్లలో.

తర్వాత వచ్చిన సేవకచీమలు నీళ్లలో తేలుతున్న చీమల మీదుగా దూక్కుంటూ ముందుకు పోయి, పాయసం గిన్నెను అందుకున్నాయి.

పాయసం వేడిగా ఉన్నది. దాంతో కాళ్ళు కాలి ఇంకా చాలా చీమలు చచ్చిపోయాయి.

వాటిమీదినుండి పైకెక్కి, పాయసాన్ని అందుకున్న చీమల్లో అధిక శాతం ఆ పాయసంలోనే పడి ప్రాణాలు పోగొట్టుకున్నాయి.

కొన్ని సేవకచీమలకు పాయసం దొరికినట్లే దొరికింది.

అయితేనేమి, అంతలోనే వచ్చిన ఇంటావిడ వాటిని దులిపేసి, పాయసాన్నంతా తమ పిల్లలకు వడ్డించేసింది!

దులిపేయబడ్డ సేవకచీమలు నోట్లో కొంచెం కొంచెం పాయసాన్ని పట్టుకొని ఇంటికి వెళ్ళాయి. మగచీమలు, ఆడచీమలు వాటిని చాలా అభినందించాయి. ఆపైన అవి తెచ్చిన పాయసాన్ని తీసుకొని, తమలో తాము పంచుకొని తిన్నాయి!

చీమల సమాజంలో ఏదో తప్పుంది. మన సమాజం కూడానూ- సరిగా లేదు. ఒకరు గెలవాలంటే ఎంతో మంది ఓడిపోవాలి, ఎందుకో.

ఎన్నెన్ని పోటీ పరీక్షలున్నాయో చూడండి! ఒక్కొక్క పోటీ పరీక్షలోనూ గెలిచేది అతి కొద్ది మందే. అయినా వాటిమీద ఆశతో ఎంతోమంది పిల్లలు తమ బాల్యాన్ని పణంగా పెడుతున్నారు. చదువులు వ్యాపారం అయిపోయి, సున్నితత్వం లోపించి, మొరటుగా మారిపోవటం మూలాన ఎందరి పసితనాలు వికసించకుండానే ముగిసిపోతున్నాయో! ఎందరెందరి జీవితాలు ఎటెటు పోతున్నాయో!

ఇదే పరిస్థితి అన్ని రంగాలలోనూ ఉన్నది- ప్రతి అభివృద్ధి వెనకాలా చెప్పలేనంత వెనకబాటు తనం ఉన్నది. ప్రతి విజయం వెనకా లెక్కలేనన్ని అపజయాలు ఉన్నాయి.

ఈ పరిస్థితులు మారతాయని ఆశిద్దాం. ఒకరి గెలుపు కోసం వెయ్యిమంది శ్రమ దోపిడీకి గురికాని రోజుల్ని తీసుకొద్దాం.

కార్మిక దినోత్సవ శుభాకాంక్షలతో,

కొత్తపల్లి బృందం.

కొత్తపల్లిని ఇంటర్నెట్‌లో http://kottapalli.in వద్ద ఉచితంగా చదవచ్చు! ఈ పుస్తకంలోని పాటలన్నిటినీ అక్కడ వినే వీలున్నది! అంతేకాదు- ఈ పుస్తకం పిడియఫ్ రూపాన్ని కూడా స్వేచ్ఛగా డౌన్లోడు చేసుకోవచ్చు!

నీతి చంద్రిక

19 వ భాగం

ఇంతవరకూ జరిగిన కథ: 'తమకు ఏమాత్రం కీడు చెయ్యని వాళ్లకు కూడా దుర్మార్గులు కీడు తలపెడతారు' అని, సంజీవకం సింహం-ఒంటె కథ చెప్పటం మొదలెడుతుంది దమనకానికి. ఏదో ఒక విధంగా సింహం చేత ఒంటెను చంపించాలని చూసే నక్క, కాకి, పులి- మూడూ సింహం దగ్గరికి వెళ్ళి తమనే తినేయమని సలహా ఇచ్చి చూస్తాయి. ఇక చదవండి, నీతిచంద్రిక 19 వ భాగం...

మూలం: కే.శే.పరవస్తు చిన్నయసూరి *సరళీకరణ: ఘడియారం వేంకట నారాయణ శర్మ*

ఆ మాటలు విని, సింహం "హరిహరీ!" అని చెవులు మూసుకుని, "ఎంత మాట వినాల్సి వచ్చింది!? ఇంత కాలం పాటు కాపాడి, ఇప్పుడు ఒక్క రోజుకు సరిపడా ఆహారం దొరకలేదని మిమ్మల్ని తింటే, ప్రజలు నన్ను తప్పు పట్టరా? ఇట్లాంటి పిచ్చి ఆలోచనలు కట్టి పెట్టండి." అన్నది.

అప్పుడు నక్క కాకిని చూసి-"నువ్వు చాలా చిన్నదానివి. నిన్ను తిన్నంత మాత్రాన రాజుగారి కడుపు నిండదు. ప్రక్కకు జరుగు-

నా శరీరాన్ని ప్రభువుల వారికి అర్పించి, కృతార్థుడినైతాను" అన్నది.

అదివిని పులి- "కాకి కంటే నువ్వు కొంచెం పెద్ద దానివే; అయినా నీ మాంసం కూడా రాజుగారి ఆకలిని తీర్చేందుకు సరిపోదు. నేను భోజనమౌతాను రాజుగారికి!"అన్నది నక్కతో.

అప్పుడు నక్క దానితో- "నువ్వు బలశాలివి. ఇవాళ్ల కాకపోతే రేపైనా రాజుగారిని పోషించే సమర్థత నీకున్నది. నీ తర్వాత మేం ఉండీ ప్రయోజనం లేదు- కాబట్టి నీ మాటల్ని పట్టించుకోకూడదు" అని పోట్లాడింది.

వాళ్ళు ముగ్గురూ ఇట్లా తగవులాడుకొంటూ ఉండగా అక్కడికి వచ్చింది, ఒంటె. అవన్నీ తమ తమ కథనాలు వినిపించాయి దానికి. అంతావిని అది-"ఏమి చేయాలో తోచనట్లు, ఇట్లా ఊరికే పెనుగులాడుతారెందుకు? ఈ పనికి సరిగ్గా సరిపోయేది నేనే! నన్ను చంపటం వల్ల ప్రభువులవారికి పాపం అంటదు- ఎందుకంటే, 'మన యీ శరీరం బాగుంటే దేన్నైనా సాధించవచ్చు; ధర్మాన్ని సాధించేందుకు మొదట కావలసింది శరీరమే' అని పెద్దలు చెబుతారు. సేవకుడు యజమాని మేలు కోరి పనిచేస్తూ మరణిస్తే నేరుగా స్వర్గ లోకపు సుఖాలను అనుభవిస్తాడు. అంతకంటే మంచి సంగతి ఇంక వేరే ఏదీ ఉండదు" అనేసింది.

అటుపైన అది సింహం వైపు చూసి "మీరు నన్ను చంపండి. దీనికి గనక మీరు ఒప్పుకోకపోతే మీ

కోసం మేం అందరం ప్రాణాలు విడిచేస్తాం" అన్నది. సింహరాజు దానిని తేరి పార చూశాడు. అంతలో నక్క కల్పించుకొని "ఈ ఒంటె చెబుతున్నది సరైనదే. ఆలోచన మాని, ఇది చెప్పినట్లు చేయండి. మేం అందరం ధన్యులమౌతాం" అన్నది. దాంతో ఇక ఆకలి బాధను భరించలేని ఆ సింహం ఒంటెను చంపి తినేసింది-

కాబట్టి, కొత్త సేవకుడితోటి రాజులుగానీ, అతని అనుచరగణం గానీ మనస్ఫూర్తిగా దగ్గర కాలేరు. పాములు చేరిన గంధపు చెట్టు మాదిరి, నీచులతో కూడుకొని ఉన్న రాజు- తన దగ్గర చేరిన వాళ్లకు అందరికీ ఆపదలే తెచ్చిపెడతాడు. అందుకని, అట్లాంటి వాడికి దగ్గరవ్వాలంటే ప్రతివాళ్ళూ భయపడతారు. దీనికి నిదర్శనంగా నేనో కథ చెబుతాను విను- అని 'వడ్రంగి-సింహం' కథను చెప్పసాగింది.

వడ్రంగి-సింహం

ఒక పట్టణంలో మంచి వడ్రంగి ఒకడు ఉండేవాడు. అతను అవసరం పడ్డప్పుడల్లా అడవికి వెళ్లి, తన పనికి సరిపోయే చెట్టును నరికి, స్తంభం మాదిరి చెక్కి, ఊరికి తీసుకు వచ్చి, దానితో రక రకాల వస్తువులు చేసి, అమ్ముకొని జీవిస్తూ ఉండేవాడు.

అతను అట్లా ఒక రోజున అడవిలో తిరుగుతూ ఉండగా, అకస్మాత్తుగా "సుహృద్విలోచనం" అనే సింహం ఒకటి వచ్చి, ఎదురుగా నిలుచున్నది. అతను చేష్టలు ఉడిగి నిల్చుండిపోయాడు.

అప్పుడా సింహం అతనిని చూసి, జాలిపడి, "ఏనుగుల కుంభస్థలాలను చీరి ముక్కలు చేస్తాయి, నా యీ గోళ్లు. బలహీనులు, జాలి చూపదగినవారు అయిన నీలాంటి అర్భకులపైకి రావటానికి ఈ గోళ్లు ఇష్టపడవు- భయపడకు" అన్నది.

అతను వెంటనే దాని ముందు సాగిలపడి మ్రొక్కి , పలు విధాలుగా దాని శౌర్యాన్ని ప్రస్తుతించి, దాని అనుమతి తీసుకొని ఇంటికి పోయాడు.

ఆనాటినుండీ అతను దానిపట్ల కృతజ్ఞుడై, అనేక రకాల మధురమైన ఆహార పదార్థాలను దానికితెచ్చిఇచ్చి, తృప్తిపరుస్తూ ఉండేవాడు.

ఇట్లా కొన్ని రోజులు గడిచింది. ఒకనాడు ఆ సింహరాజు తన అనుచరులైన కాకి -నక్కలతో ఇష్టంగా అవీ-ఇవీ మాట్లాడుతుండగా, అవి అన్నాయి- "దేవరవారు కొన్ని రోజులుగా వేటకు వెళ్లటం లేదు- కారణం ఏమిటో తెలియరాలేదు, మాకు!" అని.

అది విని సింహం -"వడ్రంగి ఒకడు, నా భక్తుడు- ఉన్నాడు. అతను ప్రతి రోజూ నాకు సరిపడా ఆహారం తెచ్చి ఇస్తున్నాడు" అని చెప్పింది. వెంటనే అవి "ఆహా! మీకు ఇంత సేవ చేస్తున్న ఆ పుణ్యాత్ముడు ఎవరో గాని, మంచి వాళ్లలో కెల్లా మంచివాడు అయి ఉండాలి! ప్రభువుల వారి ఆజ్ఞ అయితే, ఆ మహానుభావుడిని మా కళ్లారా చూసి, తరిస్తాము" అన్నాయి.

సింహం "సరే "అని, "అతను- అదిగో, ఫలానా సమయానికల్లా వచ్చేస్తాడు- ఉండండి" అన్నది.

అనుకున్న సమయానికే అక్కడికి చేరుకున్నాడు వడ్రంగి. అయితే కాకి-నక్కలను చూడగానే అతను విపరీతంగా భయపడ్డాడు. గబగబా పరుగెత్తి, దగ్గరలో కనబడ్డ చెట్టుపైకి ఎగబ్రాకి కూర్చున్నాడు.

సింహం ఆ చెట్టు దగ్గరికి పోయి , క్రింద నిలబడి "ఓ స్నేహితుడా! ఎందుకు, ఇలా యీ చెట్టెక్కి కూర్చున్నావు?" అని అడిగింది.

"దుర్మార్గులుగాను, చావు తెలివిగల

వాళ్లుగాను పేరు గాంచిన కాకి-నక్క నీతోపాటు ఉండటం చూశాను గనుక, చెట్టెక్కి కూర్చున్నాను. చెడ్డవాళ్లతో కూడిన రాజును ఎప్పుడూ నమ్మరాదు" అన్నాడు వడ్రంగి.

ఆపైన అతను కదలకుండా ఆ చెట్టుమీదనే కూర్చొని, ఏదో బిడారు ఒకటి తన సమీపంలోకి రాగానే, ఆ వర్తకులను దగ్గరికి పిలిచి, వాళ్ళందరితోటీ కలిసి భద్రంగా అడవిని దాటి వెళ్లిపోయాడు. మంచివాడే అయినప్పటికీ చెడ్డవాళ్లతో సహవాసం చేయటం వల్ల చెడ్డవాడుగానే పరిగణింపబడతాడు. కొంగల గుంపులో జీవించే హంసను కూడా కొంగ అనే అనుకుంటారు గదా? రాజు గనుక మంచివాడు అయితే, అతని అనుచరులు కూడా మంచి వాళ్లు అవుతారు- "యథా రాజా తథా ప్రజా"- రాజు ఎలాంటి వాడైతే ప్రజలు అలాంటి వాళ్లౌతారు. మన ప్రభువుకు దగ్గరలో ఉండేవాడే, ఎవరో దుర్మార్గుడు- నామీద చాడీలు కథలు కథలుగా కల్పించి చెప్పి, ఆయనకు నా మీద అంతులేని కోపం తెప్పించి ఉంటాడు. అయినా జరిగిపోయిన దానికి విచారించి ఏమీ లాభం లేదు. ఊరికే చనిపోయేదెందుకు? పోరాడతాను- ఒకవేళ గెలిచాననుకో- కీర్తి సంపదలు పొంది సుఖంగా జీవిస్తాను. లేదా, శూరులైన వాళ్లందరూ మెచ్చుకునేట్లు పోరాడినా కూడా ఓడిపోయానే అనుకో; అప్పుడు విజయ స్వర్గం పొంది సుఖిస్తాను. అందువల్ల ఎటు చూసినా ఇంక పోరాటమే, తప్పదు!" అన్నది ఎద్దు.

అప్పుడు దమనకం "నువ్వన్నది నిజంగానే శూరులైన వాళ్లు మెచ్చేమార్గం. అయినప్పటికీ, ఏదైనా ఉపాయంతో శత్రువులను తప్పించుకొనిపోవాలి. సామ-దాన-భేద-దండోపాయాలలో చివరిది పోరాటం. అది మంచిదే, గౌరవనీయమే- కానీ

వీరమరణమే గొప్పదని భ్రాంతి చెంది, గొప్ప వాళ్ళతో ఢీకొని చచ్చిపోవటం సరైన పని కాదు. "జీవన్ భద్రాణి పశ్యతి"-ప్రతి జీవీ భద్రంగా ఉండాలనుకుంటుంది- అని పెద్దలు చెబుతారు. దాన్ని పాటించాలి గదా? మన వల్ల అయ్యే దాన్నీ, శత్రువు బలాబలాలనూ- రెండింటినీ తెలుసుకొని, ఒకసారి 'జయం నిశ్చయం' అనిస్థిరపడ్డాక, పోరాటం మొదలు పెట్టాలి. అలా కాక పోతే పరువు చేటు తప్పదు.

గతంలో సముద్రుడంతటి వాడు కూడా ముందు వెనుకలు ఆలోచించకుండా ఒక తీతువు పిట్టను ఓడించాలని చూసి, తనే ఓడిపోయి పరువు పోగొట్టుకున్నాడు. ఆ కథ చెబుతాను విను-" అని 'తీతువు-సముద్రం' కథను ఇట్లా చెప్పసాగింది:

తీతువు పిట్ట- సముద్రం

సముద్రపు ఒడ్డున ఒక పెద్ద చెట్టు ఉండేది. దానిమీద గూడు కట్టుకొని ఒక తీతువు పిట్ట, దాని భార్య నివసించేవి. కొంతకాలానికి ఆ ఆడపక్షి గుడ్లు పెట్టే సమయం వచ్చింది. మొదటిసారి తండ్రి కాబోతున్న మగపిట్టకు చాలా సంతోషం వేసింది. అది చాలా ప్రేమగా భార్యను చేరి, "నీకేది ఇష్టమో అడుగు, ఎంత శ్రమపడైనా సరే, నీ కోరిక నెరవేరుస్తాను" అన్నది. అప్పుడు ఆడపక్షి దానితో "చాలా కాలంగా నా మనసులో కొంత భయం ఉన్నది- అమావాస్య-పౌర్ణమి రోజుల్లో సముద్రుడి అలలు ఆకాశమంత ఎత్తుగా ఎగురుతాయి. మనగూడేమో ఉన్నది చాలా తక్కువ ఎత్తులో. అందుకని నేను పెట్టిన గుడ్లన్నీ నీట కలసిపోయే ప్రమాదం ఉన్నది. నువ్వు ఇప్పుడు త్వరగా మన గూటికి తగిన వేరేచోటును వెతికి పెట్టు. అక్కడికి వెళ్ళిపోదాం. ఆలస్యం చేయకు- పురుటి సమయం దగ్గరపడ్డాక వేరే చోటికి మారటం కష్టం అవుతుంది" అన్నది.

అప్పుడు మగపిట్ట భార్య భయాల్ని కొట్టి పడేసినవ్వుతూ "కలువపూల గుంపుకు చందమామ, తామరపూల దండుకు సూర్యదేవుడు, వానకోయిలల సమూహానికి మేఘుడు ఏవిధంగా రాజులో, అట్లాగే మన పక్షిజాతికి ప్రభువు గరుత్మంతుడు. ఆయన చాలా బలశాలి. తన రెక్కల్ని ఆడించగా వచ్చిన గాలితో ఎంతటి నీళ్ళనైనా ఎగరగొట్టగల సమర్థుడు. ఆయన్ని ఆశ్రయించుకొని ఉన్నాం, మనం- ఆయన జాతి వాళ్లం!- అట్లాంటి మనల్ని, ఈ సముద్రుడు అంత తేలికగా ముంచెత్తగలడా?!

అయినా నా శక్తి ఎంతటిదో తెలియని దానికి మళ్లే నువ్వు ఎందుకు, ఇట్లా అనవసరపు ఆలోచనలతో మనసు పాడు చేసుకుంటావు? కులాసాగా ఉండు!" అన్నది.

అప్పుడా ఆడపిట్ట "ఎంతగొప్పవారైనా సరే, రాబోయే ప్రమాదాన్ని- అందునా ప్రాణాపాయం కలిగించే సమస్యను- ముందుగా గమనించుకొని, దానికి తయారుగా ఉండాలిగాని, 'బలవంతుడిని కదా, నాకేం అవుతుంది?' అని గర్వంతో మిడిసిపడి, అప్రమత్తంగా ఉండకూడదు అని పెద్దలు చెబుతారు. ఇక నావంటి బలహీనుల సంగతి ఏం చెప్పాలి? మంచిమాటలు చెవిన వేసుకొనని మూర్ఖుడు 'కోల విడిచి పడిన తాబేలు' మాదిరి, కష్టాల పాలౌతాడు. నీకు ఆ కథ చెబుతాను విను- అని తాబేలు-హంసల కథను చెప్పసాగింది:

హంసలు-తాబేలు

ఒక అడవిలో భువనసారం అనే కొలను ఒకటి ఉండేది. చాలా చక్కని ఆ కొలను చుట్టూ కొంగలు, హంసలు, మరెన్నో రకాల నీటి పక్షులు ఎల్లప్పుడూ తిరుగుతూ ఉండేవి. ఆ కొలనులో ఎన్ని తెల్లతామరలు పూచేవంటే,

వాటి లోంచి జాలువారే చిక్కని మకరందాన్ని చూసి నివ్వెరపోయిన తుమ్మెదల గుంపులు వాటి చుట్టూ "ఝుం ఝుం" అని ఎంత తిరిగినా ఆ మకరందం అయిపోయేది కాదు! ఆట్లాంటి ఆ కొలనులో 'కంబుగ్రీవం' అనే తాబేలు నివసిస్తూ ఉండేది. 'వికటం, సంకటం' అనే రెండు హంసలు, దాని స్నేహితులు.

ఒక సంవత్సరం పెద్ద కరువు వచ్చింది. ఆ కొలనులోకి చేరుకునే వాగులన్నీ పూర్తిగా ఎండిపోయాయి. కొలనులోని నీళ్ళు కూడా కొద్ది కొద్దిగా ఇగిరిపోవటం మొదలైంది. హంసలు రెండూ ఆ కొలనును విడిచిపెట్టి వేరే చోటికి వలస పోదామని నిశ్చయించుకున్నై. పోయేముందు అవి తాబేలు దగ్గరికి వచ్చి ఆ సంగతి చెబుతుంటే, దు:ఖంతో వాటి గొంతులు పూడిపోయాయి. "మన స్నేహాన్ని మరువకు మిత్రమా, మనకీ ఎడబాటు తప్పదు- పోయి వస్తాం" అని అవి చెబుతుంటే తాబేలుకు కూడా అంతులేని విచారం వేసింది. దు:ఖంతో ముఖం ఉబ్బగా, అది- "చాలా కాలం పాటు అన్నదమ్ములలాగా కలసి మెలసి జీవించాం. మనం విడిపోవాల్సిన పరిస్థితులు ఎదురౌతాయని కలలో కూడా అనుకోలేదు. నాకూ మీతోపాటు రావాలని ఉంది- కానీ మీరేమో పక్షులు- మీకు రెక్కల బలం ఉంది. మీకు ఇష్టం వచ్చిన చోట్లకల్లా మీరు ఎగిరి పోగలరు. నేను అలా కాదుగదా! సరే, నాకు లేని వాటి సంగతిని అటుంచండి. మిమ్మల్ని నేను వేడుకొనేది ఒక్కటే- మన స్నేహం సాక్షిగా మీరు నా ప్రార్థనను అంగీకరించాలి. ఏదో ఒక మార్గం ఆలోచించండి- మీతోబాటు నన్నూ తీసుకుపోండి. మిమ్మల్ని విడిచిపెట్టి నేను ఒక్క క్షణం కూడా ఉండలేను" అన్నది.

(మిగతాది మళ్ళీ...)



ఎవరు గొప్ప?

'అన్ని ప్రాణులకంటే మనిషే అధికుడు' అన్న భావన ఈ నాటిది కాదు. 'మనిషి ప్రకృతి పైన ఆధిపత్యం చెలాయించటం వెనుక కూడా ఈ ఆలోచనే ఉంది' అని చెబుతారు పెద్దలు. ఈ వాదనలో నిజానిజాలను ప్రక్కన పెట్టి, నికిత వ్రాసిన కథను చదవండి. ఆ పైన తీరిగ్గా కూర్చొని ఆలోచించండి-'నిజంగా మనం గొప్పవాళ్లమేనా?'

రచన: కె.నికిత, 7 వతరగతి, ఏ.పి.ఆర్.ఎస్.దిగ్వాల్

ఒక ధనవంతుడి ఇంట్లో ఒక కుక్క, మేక, కోడి, రామచిలుక పెరుగుతున్నాయి.

ఒకరోజున "తమలో ఎవరు గొప్ప?" అనే చర్చ మొదలైంది, వాటి మధ్య.

ముందుగా కోడి ఇలా అన్నది: "నేను పెట్టిన గుడ్లతో మన యజమాని లక్షలు సంపాదించాడు. అంతే కాదు నా మాంసం కూడా వ్యాపారానికి ఉపయోగపడుతుంది. అందుకని నేనే మీ అందరికన్నా గొప్పదాన్ని" అని.

అని అదివిని కుక్క నవ్వి , "పోవోయ్ , పెద్ద చెప్పొచ్చావ్! ఆయన లక్షలు సంపాదించినా,

వాటికి కాపలా కాసేది నేనే కదా?! సంపాదించడం కన్నా, ఆ సంపాదించిన దాన్ని కాపాడుకోవడం మరింత కష్టం - కనుక నేనే మీ అందరికన్నా గొప్ప" అన్నది.

అప్పటిదాకా మౌనంగా ఉన్న మేక నవ్వుతూ అన్నది-"మనిషి ఎంత సంపాదించినా, ఆరోగ్యం కావాలి- లేకపోతే ఏం లాభం? నా పాలు తాగడం వల్లే మన యజమాని ఆరోగ్యంగా ఉండగల్గుతున్నాడు. అంతే కాదు- గాంధీ తాత అంతటివాడు కూడా నా పాలు తాగేవాడు తెలుసా? అందుకని నేనే మీ అందరికంటే గొప్పదాన్ని" అన్నది మేక.

అప్పుడు పంజరంలోంచి అందరి మాటలూ వింటున్న చిలుక అన్నది: "మనిషికి ఎంత సంపద ఉన్నా, మానసిక ప్రశాంతత కరువైతే ఏం ప్రయోజనం? నా ముద్దు ముద్దు మాటలతో మన యజమానిని ఎంతగానో ఆనందపరుస్తున్నాను. ఆయన వ్యాపారరీత్యా ఎక్కడెక్కడో తిరిగి, అలిసిపోయి ఇల్లు చేరుకుంటాడు. ఆ సమయంలో ఆయనకు నా మాటలు ఎంతో ఆనందాన్ని కల్గిస్తాయి; శాంతినిస్తాయి. ఇప్పుడు చెప్పండి-'మీ అందరికంటే నేనే గొప్ప- ఒప్పుకుంటారా, లేదా?' అన్నది చిలుక.

ఇంతలో వాళ్ల వెనుక నుంచి 'నేను ఒప్పుకోను' అని వినిపించింది. వాళ్ల యజమాని మాటలు విని అవన్నీ ఉలిక్కిపడ్డాయి-

"మీ కన్నా గొప్పవాడిని నేనే! మీ అందరినీ నా అవసరాలకి ఉపయోగించుకుని నేను ఎన్నో పనులు చేయగల్గుతున్నాను. ఇంకా ఎన్నో క్రొత్త క్రొత్త విషయాలు కనిపెట్టగల్గుతున్నాను! కాబట్టి మీ అందరికంటే నేనే గొప్పవాడిని- ఏమంటారు?" అంటూ వాటివైపు చూశాడు.

అవన్నీ ఏకీభవిస్తున్నట్లు తలలు ఊపాయి.

పల్లెమనిషి

రచన: R.ప్రగతి, 8 వతరగతి, Z.P.H.S., వెంకటంపల్లి, అనంతపురం జిల్లా.

చాలా కాలంక్రితం వెంకటంపల్లిప్రక్కనే ఒక చిన్న అడవి ఉండేది. ఆ అడవిలో ఒక సాధువు నివసిస్తూ ఉండేవాడు. అడవిలో దొరికిన వన మూలికలతో ఆయుర్వేద మందులు తయారు చేసేవాడు ఆ సాధువు. జబ్బు చేసిన వాళ్ళు చాలామంది వచ్చి ఆయన దగ్గర మందులు తీసుకొని వెళ్లేవాళ్లు.

ఆయన ఇచ్చే మందులు బాగా పని చేస్తాయని పేరు ఉండేది. ఆయనకు సహాయకుడుగా పని చేసేవాడు మల్లయ్య. మూలికల సేకరణలోను, మందుల తయారీలోను మల్లయ్య ఆ సాధువుకు చేదోడు వాదోడుగా ఉండేవాడు.

ఆ సమయంలో అనంతపురం జమీందారుగారికి తీవ్రమైన తలనొప్పి మొదలైంది. ఆస్థానంలోని వైద్యులు ఆయనకు వైద్యం చేశారు గానీ ఆయన సమస్య వాళ్లకెవ్వరికీ లొంగలేదు. చివరికి ఎవరి ద్వారానో విని, జమీందారు గారు స్వయంగా

సాధువు దగ్గరకు వచ్చి తన తలనొప్పికి మందు తీసుకొని వెళ్ళటం మొదలుపెట్టారు. త్వరలోనే ఫలితం కనిపించింది! అచిర కాలంలోనే ఆయన తలనొప్పి పూర్తిగా తగ్గిపోయింది!

దాంతో జమీందారుగారికి సాధువంటే ప్రత్యేకమైన అభిమానం ఏర్పడ్డది. తనకు వీలు దొరికినప్పుడల్లా, వారం వారం- క్రమం తప్పకుండా వచ్చి ఆయన సాధువును కలుసుకొని వెళ్ళేవాడు. రాను రాను ఆయనలో ఒక కోరిక బలపడ సాగింది- "ఇంత శక్తి గల సాధువు ఎక్కడో మారుమూలన, వెంకటం పల్లిలో ఉండటం కంటే, తమ ఆస్థానంలో ఉంటే ప్రజలందరికీ వీలుగా ఉంటుంది కదా? ఆయన కారణంగా ఆయుర్వేదానికీ ప్రాచుర్యం లభిస్తుంది; ప్రజలకూ మేలు జరుగుతుంది!" అందుకని ఆయన ఒక రోజున సాధువును తమ సంస్థానానికి ఆహ్వానించాడు.

అయితే సాధువు అందుకు అంగీకరించలేదు. "నాయనా! నేను ప్రకృతిలో పెరిగినవాడిని- అంతంత దూరాలు రాలేను నాయనా! సంస్థానాలు తిరగటం నావల్ల కాదు" అన్నాడు. "ఒక్కసారి వచ్చి వెళ్ళండి- కొన్ని రోజులు ఉండి వెళ్ళండి " ప్రాధేయపడ్డారు జమీందారుగారు. ఎంత చెప్పినా సాధువు ససేమిరా ఒప్పుకోలేదు.

"కానీలే, నువ్వైనా రావయ్యా, మల్లయ్యా!" అన్నారు జమీందారు గారు మల్లయ్యతో. ఎన్నాళ్లనుంచో అనంతపురం వెళ్ళి వింతలు-విశేషాలు చూడాలని ఉండేది మల్లయ్యకు. అందుకని, ఆహ్వానించిందే తడవు జమీందారు గారి వెంట బయలు దేరి సంస్థానానికి వెళ్ళాడు.

అనంతపురం చేరుకోగానే జమీందారు గారు రెండు గుడ్డలను తెప్పించారు. ఒకటి తన మూతికి కట్టుకున్నారు; మరొకటి మల్లయ్యకిచ్చి కట్టుకొమ్మన్నారు. "ఎందుకు,

మహాప్రభూ?" అడిగాడు మల్లయ్య అనుమానంగా. "సంస్థానంలో అంతటా వాతావరణం బాగుండటం లేదు మల్లయ్యా! అనేక చోట్ల చెడు వాసనలు ఉంటున్నాయి. అలాంటి మురికి గాలిని మనం తట్టుకోవాలంటే ఈ గుడ్డ తప్పనిసరి" అన్నారు జమీందారు గారు. "ఓహో!" అని ముఖానికి అడ్డంగా గుడ్డను కట్టుకున్నాడు మల్లయ్య.

అంతలో జమీందారు గారు రెండు మంచినీళ్ల బాటిళ్ళు తెప్పించారు. "ఇవి ఎందుకు ప్రభూ?" అడిగాడు మల్లయ్య. "సంస్థానంలో అన్ని చోట్లా నీళ్ళు బాగుండటం లేదు మల్లయ్యా! నీటి కాలుష్యం వల్ల వ్యాధులు వ్యాపిస్తున్నాయి. వాటినుండి తట్టుకోవాలంటే ఈ జాగ్రత్త తప్పనిసరి. ఎక్కడ పడితే అక్కడ నీళ్లు త్రాగకూడదు" వివరించారు జమీందారు గారు.

అంతలో ఇద్దరూ జమీందారు గారి భవంతిని చేరుకున్నారు. సేవకులు వాళ్ళిద్దరికీ మర్యాద చేసి, భోజనం వడ్డించారు. మల్లయ్య చేత్తో భోజనం చెయ్యబోతుంటే వారించి, జమీందారు గారు అతని చేతికి రెండు స్పూన్లు ఇచ్చారు. "ఇవెందుకు ప్రభూ? చక్కగా చేతితో తినచ్చుగా?" అన్నాడు మల్లయ్య. " నాకూ శుభ్రంగా చేత్తో అన్నం తినాలని ఉంటుంది మల్లయ్యా! కానీ మన సంస్థానంలో ఎన్నెన్ని సూక్ష్మ క్రిములు ఉంటున్నాయంటే, ఇక్కడ-మన చేతిలోనే, మనకు కనబడకుండా ఎన్నో సూక్ష్మజీవులు ఉంటున్నాయి. అవి ఒక్కసారి మన కడుపులోకి వెళ్ళినా ప్రమాదం తప్పదు! ఇంకేం చేస్తాం? అందుకని ఇప్పుడు అందరమూ స్పూన్లతోటే తింటున్నాం!" అన్నారు జమీందారు గారు. మల్లయ్య ఆ స్పూన్లతోటే ఏదో తిన్నాననిపించాడు.

ఆ సరికి బాగా చీకటి పడింది. జమీందారు గారు తనకోసం సిద్ధం చేయించిన పరుపులో పడుకున్నాడు మల్లయ్య. ఎంత ప్రయత్నించినా నిద్ర పట్టలేదు. "ఊరికే అలా తిరిగి వద్దాం" అని లేచి మూతికి గుడ్డలేకుండా బయటకు వెళ్ళాడు మల్లయ్య. అక్కడ ఉన్న మురికి వాసనకు కడుపు తిప్పినట్లైంది. సంస్థానంలో 'త్రాగు నీరు' అని రాసి పెట్టి ఉన్న

కుళాయి దగ్గరికి వెళ్ళి కాసిని నీళ్ళు త్రాగాడు- అంతే! ఏం జరిగిందో గాని, వదలకుండా వాంతులు మొదలయ్యాయి.

తెల్లవారే సరికి పూర్తిగా నీరసించిపోయాడు

మల్లయ్య. 'మా వైద్యుల చేత వైద్యం చేయిస్తాను ఉండమ'న్నారు జమీందారు గారు.

కానీ మల్లయ్య ఒప్పుకోనేలేదు. "లేదు లేదు- నేను వెళ్తాను. నాకు ఏమాత్రం బుద్ధి ఉన్నా ఇంక సంస్థానాలకు రాను. ముందుగా నేను సాధువు దగ్గరకు వెళ్లాలి- క్షమించండి- ఇక్కడ నీరూ బాగాలేదు; గాలీ బాగా లేదు; వాతావరణమూ బాగాలేదు- ఇక ఇక్కడ ఉండేది దేనికి? నేను వెళ్తాను-ఏమీ అనుకోకండి" అంటూ నీరసంగానే లేచి, మల్లయ్య వెంకటంపల్లి దారి పట్టాడు.

ప్రసాదం భక్తి!

జోకు

భక్తుడు: పూజారి గారూ! ఓ చిన్న అభ్యర్థన-

పూజారి: చెప్పండి-

భక్తుడు: నాకు షుగర్ వ్యాధి వచ్చిందండీ!

పూజారి: అయ్యో! మరేం చేద్దాం? హోమం ఏదైనా చెయ్యమంటారా?

భక్తుడు: అదేం వద్దు లేండి- రేపట్నుంచి దేవుడికి నైవేద్యంగా చక్కెర పొంగలికి బదులు మిరియాల పొంగలి పెట్టండి చాలు!

సేకరణ: G. సుచరిత



చీమ-అగ్గిపుల్ల

సొంతప్రయత్నంతో చిన్న చిన్న విషయాలు బాగా అర్థం చేసుకుంటున్నారా, లేదా? నందన చీమ రాసిన ఈ కథను చదవండి; వంటపట్టించుకోండి మీరున్నా.

రచన: A.S. నందన, 3 వ తరగతి, టింబక్టు బడి, అనంతపురం జిల్లా

అనగా అనగా ఒక చీమ ఉండేది.

వాళ్ల అమ్మను అది రోజూ అడుగుతూ ఉండేది- "అమ్మా, పిన్నమ్మ వాళ్ళ ఇల్లు ఎంత దూరం?"అని. అడిగితే, వాళ్ళ అమ్మ "చాలా దూరం" అనింది.

"మరి, తాత వాళ్ళ ఇల్లు ఎంత దూరం?" అని అడిగితే "చాలా దూరంరా, కన్నా!" అని అమ్మ చీమ బదులిచ్చింది.

"ఓహో! మరి సూర్యుడు ఎంత దూరం అమ్మా?" అని అడిగితే అమ్మ చీమ అన్నది- "చాలా చాలా దూరంరా బుజ్జీ!" అని అనింది.

అయితే 'చాలా దూరం' అంటే ఎంతో చిన్నారి చీమకు అర్థం కాలేదు.

'చాలా చాలా దూరం' అంటే ఇంక ఏమాత్రమూ అర్థం కాలేదు. కానీ అర్థం చేసుకోవాలని గట్టిగా అనుకుంది అది.

అప్పుడు ఇంక చిన్నారి చీమ ఒక అగ్గిపుల్లను తీసుకుంది. దాంతో కొలుచుకుంటూ వాళ్ళ పిన్నమ్మ ఇంటికి వెళ్ళింది. దాంతో 'చాలా దూరం' అంటే ఏంటో కొంచెం కొంచెం అర్థం అయింది దానికి.

చాలా నడిచింది కదా, దానికి బాగా కాళ్ళు నొప్పులు పుట్టాయి.

పిన్నమ్మ పెట్టింది తిని, కొంచెం సేపు విశ్రాంతి తీసుకొని, అక్కడి నుండి మళ్ళీ అగ్గిపుల్లలతో కొలుచుకుంటూ తాత వాళ్ళ ఇంటికి వెళ్ళింది.

తాత ఇల్లు చేరుకునేసరికి చిన్నారి చీమకు 'చాలా దూరం ' అంటే ఏమిటో బాగా అర్థమైపోయింది.

తన ఇంటి నుండి పిన్నమ్మ ఇంటికి '9 అగ్గిపుల్లల దూరం' అని, అక్కడినుండి తాత ఇల్లు '13 పుల్లల దూరం' అని తేల్చింది.

'చాలా దూరం' అంటే దానికి బాగా అర్థమయ్యేసరికి, 'చాలా చాలా దూరం' అంటే ఏంటో సులభంగా ఊహించుకోగలిగింది అది.

సొంత ప్రయత్నంతో చిన్న విషయాల్ని బాగా అర్థం చేసుకుంటే, పెద్ద విషయాలుకూడా సులభంగా తెలుస్తాయని చిన్నారి చీమకు బాగా వంటపట్టింది.

వరాల పాము

కథనం: టి.ఆమని, 6 వతరగతి, టింబక్టు బడి.

ఒక ఊళ్ళో సీత-గీత అనే ఇద్దరు స్నేహితులు ఉండేవాళ్ళు. ఆ పిల్లలకు చదువు అంటే ఇష్టం లేదు. వాళ్ళ అమ్మా నాన్నలు వాళ్ళని చదువుకోమని చాలా సతాయించేవాళ్ళు. వాళ్ళు రోజూ బడికి పోతున్నామని చెప్పి, దారిలో ఒక గుడి వద్ద ఉండి పోయేవాళ్ళు. అక్కడే సంతోషంగా ఆడుకునేవాళ్ళు.

ఒక రోజు వాళ్ళకు గుడి పక్కన చెత్తలో ఒక సీసా దొరికింది. దానిలో ఏముందో కనుక్కోవాలని దాని మూతను తీసారు. దాని నుండి చిన్న పాము ఒకటి బయటకు వచ్చింది. పామును చూసి ఇద్దరూ భయపడి పోయారు. సీసాను అక్కడే పడేసి, అక్కడి నుండి పారిపోబోయారు. అంతలో ఆ పాము "పిల్లలూ,ఆగండి!" అని గట్టిగా అరిచింది. 'ఎవరబ్బా?' అని పిల్లలిద్దరూ ఆగి, వెనక్కి తిరిగి చూశారు.

"ఇదేంటబ్బా! పాము మాట్లాడతా ఉంది?! దీనికి దైవ శక్తులున్నట్లున్నాయి! ఏ రాక్షసో దీన్ని సీసాలో బంధించి ఉంటుంది" అని సీత-గీత ఇద్దరూ అనుకుంటూ నిల్చుకొని ఉంటారు.

“మీరు అనుకుంటున్నది నిజం", అని పాము అన్నది.

ఇప్పుడు సీత ధైర్యం తెచ్చుకొని, "మా మనసులోని మాట నీకెలా వినిపించింది?" అని పామును అడిగింది.

“నేను ఎవరి మనసులో ఉన్న మాటలనైనావినగలను, మీరు నాకు చేసిన మేలు సాన్యమైనది కాదు. దానికి ప్రతిఫలంగా మీకు మూడు వరాలు ఇస్తాను. ఏమి కావాలో కోరుకోండి ” అన్నదా పాము.

అప్పుడు సీత అంటుంది, "నేను ఒక తోట పెట్టుకుంటాను. దానికి రకరకాల మొక్కల విత్తనాలుండే ఒక విత్తనాల ప్యాకెట్ కావాలి"

అని. అంతే! టక్కున ఒక విత్తనాల ప్యాకెట్ ఆమె చేతిలోకి వచ్చేసింది.

పిల్లలిద్దరికీ దాన్ని చూసి చాలా సంతోషం అయ్యింది. అప్పుడు గీత అన్నది- "నాకు సినిమా తీయాలని ఉంది" అని. అంతే! టక్కున ఎవరో సినిమా వాళ్ళు వచ్చి ఆమెను తీసుకెళ్ళిపోయారు. తక్షణమే ఒక సినిమా తీసేశారు!

రెండు కోరికలూ నెరవేరాక, మరిప్పుడు 'మూడో వరం ఏం కోరుకోవాలి?' అని వాళ్ళిద్దరికీ సందేహం వచ్చింది. ఏది ఆలోచించినా ఒకళ్లకి నచ్చితే ఒకళ్లకి నచ్చలేదు! పామేమో వాళ్లని తొందర పెడతా ఉంది- "త్వరగా చెప్పండి- నేను వెళ్ళాలి" అంటోంది.

ఎంత తన్నుకలాడినా సీత-గీతలిద్దరికీ మంచి ఆలోచన ఒక్కటంటే ఒక్కటీ తట్టలేదు.

చాలా సేపు ఇట్లా గడిచాక, వాళ్ళ అవస్థని చూసి గట్టిగా నవ్వింది పాము. "ఏమ్మా! మీరిద్దరూ విద్యార్థులు కదా? చదువుకునే వాళ్ళేనా? ఎంత ఆలోచించినా మీకు ఒక్క వరమూ దొరకలేదా, మంచిది, అడగటానికి వీలైనది? నాకు తెలిసిపోయింది- మీ ఇద్దరికీ చదువంటే ఇష్టం లేదు. చదువుకునేవాళ్లకు చదువులంటే ఇష్టం లేకపోతే ఎలాగ? ఇంక వాళ్ళు ఎలా చదువుకుంటారు? అందుకని, మీ మంచికోరి, మీరు అడగకపోయినా నేనే మీకు మూడో వరం ఇచ్చేస్తాను- "మీరిద్దరూ బాగా చదువుకొని, మంచి మనుషులుగా ఎదుగుతారు" అని చెప్పేసి అది నవ్వుతూ మాయమైపోయింది.

సీత-గీతలకు ఇద్దరికీ ఆ తర్వాతినుండీ- ఎందుకో మరి, బడి ఎగగొట్టబుద్ధి కాలేదు!

జోల! **జోకు**

కొడుకు : నాన్నా! నాకు సన్నాయి నేర్చుకోవాలని ఉంది- కొనిపెట్టవా, ప్లీజ్!?

తండ్రీ : సన్నాయి చాలా పెద్దగా శబ్దం చేస్తుందిరా! వాయిస్తే గోలగా ఉంటుందిరా!

కొడుకు : రాత్రి మీరంతా నిద్రపోయాక వాయిస్తాలే నాన్నా, ప్లీజ్!

సేకరణ: G. సుచరిత



కొండ ముసవ

అనంతపురం జిల్లాలో నల్ల మూతితో ఉండే పెద్ద పెద్ద కోతుల్ని 'కొండ ముసవలు'(కొండముచ్చులు?) అంటారు. ఇవి మామూలు కోతులకంటే పెద్దగానూ, బలంగానూ ఉంటాయి. మధు చెబుతున్న కొండముసవకథనుచదవండి:

రచన:యం.మధుసూదనరెడ్డి, 7 వతరగతి, Z.P.H.S., ఒంటికొండ, అనంతపురంజిల్లా.

చెన్నేకొత్తపల్లికి దగ్గర్లో ఒక కొండ ఉండేది. ఆ కొండ చుట్టూ దట్టమైన అడవి ఉండేది. ఆ అడవిలో చాలా కోతులు ఉండేవి, గుంపుగా. వాటిలో చాలా బలంగా ఉండే కోతులను అవి నాయకులుగా ఎన్నుకునేవి. అలా ఎంపికయ్యే కోతులు చాలా దూరం ఎగిరేవి; చాలా బాగా యుద్ధం చేసేవి. ఆ నాయకుల బలాన్ని, శక్తిని ఆధారం చేసుకొని, కోతులన్నీ అడవిలో సుఖంగాకాలంవెళ్ళబుచ్చేవి.

ఇలా ఉండగా ఆ అడవిలోకి ఎక్కడినుండి

వచ్చిందో గాని, కొండముసవ ఒకటి వచ్చింది. అది మామూలు కోతులకంటే చాలా పెద్దగా ఉండేది. వాటి నాయకుల కంటే రెండు రెట్లు ఎక్కువ దూరం ఎగిరేది. దానికి వేరే తోడు కూడా ఎవ్వరూ లేరు! అందుకని అది ఈ కోతుల గుంపుతో స్నేహం చేయాలని ఉబలాట పడింది. అయితే మామూలు కోతులన్నీ దాన్ని చూడగానే పరుగు లంకించుకునేవి. దాన్ని ఏమాత్రం దగ్గరికి రానిచ్చేవి కావు. కోతి నాయకులుకూడా కొండ ముసవ గురించిన చెడు విషయాలను చిలవలు పలవలుగా చెప్పి, వాటి ఈ భయాన్ని మరింత పెంచినై. దాంతో అవన్నీ "ఈ కొండముసవను ఇక్కడినుండి ఎలాగైనా తరిమెయ్యాలి" అన్న నిర్ణయానికి వచ్చాయి.

ఒక రోజున ఆ కోతులన్నీ కలిసి సంఘం ఏర్పాటు చేసాయి. కొండ ముసవను కొండ నుండి తరిమేసేందుకు ఉపాయాలు ఆలోచించాయి. చివరికి ఒక కోతి "వేటకుక్కకు చెబితే అది దీని పని పడుతుంది"అన్నది. కోతులన్నిటికీ ఆ ఉపాయం నచ్చింది.

అవన్నీ కలిసి వేటకుక్కతో మాట్లాడేందుకు వెళ్లాయి. అన్నీ దూరంగా నిలబడి మాట్లాడితే "వినబడటం లేదే, కొంచెం దగ్గరికి వచ్చి చెప్పండి " అన్నది కుక్క. అవి ఇంకొంచెం దగ్గరికి జరిగాయి. "అయ్యో, ఇంకా వినబడటం లేదు" అన్నది కుక్క. అట్లా కోతులన్నీ వేటకుక్క దగ్గరికి వెళ్ళినై. చూసీ చూసీ ఒక్కసారిగా వాటి మీదికి దూకింది కుక్క. కోతులన్నీ చెల్లాచెదరు అయిపోయాయి. అయినా వేటకుక్క వాటిని వదలకుండా వెంటపడింది. అంతలో ఎక్కడినుండి వచ్చిందో మరి, కొండముసవ వచ్చి వేటకుక్కకు ఎదురుగా నిలబడింది. కోతులన్నీ దూరంగా ఉన్న చెట్లమీద కూర్చొని చూస్తూ ఉంటే, కొండముసవ ఒక్కతే కుక్కతో పోరాటం చేసింది. దాని ధాటికి తట్టుకోలేక చివరికి వేటకుక్కకూడా తోకముడిచి పారిపోయింది!

అప్పటికిగానీ కోతులకు కొండముసవ మంచితనం అర్థం కాలేదు. అవన్నీ కొండముసవకు కృతజ్ఞతలు చెప్పి, దాన్ని

కూడా తమ గుంపులో చేర్చుకున్నాయి. ఆనాటినుండీ అన్నీ కలసి మెలసి ఉండసాగినై. కొండముసవ వాటికి కలసి పనిచెయ్యటం నేర్పింది. ప్రతిదానికీ నాయకులమీద ఆధారపడకుండా, 'ఎవరికి వాళ్ళు సొంత ప్రయత్నం చెయ్యాలి' అని చెప్పేదది. దాంతో కోతులన్నిటికీ స్వయంకృషి అలవడింది. సొంత శక్తి మీద ఆధారపడిన కోతులు అడవిలో మునుపటికంటే సుఖంగా జీవించసాగాయి.

కొన్నాళ్లకు కొండముసవ ముసలిదై చనిపోయింది. కోతులన్నీ చాలా బాధపడ్డాయి. వేటికవి కొండముసవ ఆదర్శాలను కొనసాగించాలని నిర్ణయించుకున్నాయి.

వెంగళప్ప తెలివి! **జోకు**

వెంగళప్ప ఒక అద్దం కొనుక్కున్నాడు. తర్వాత చూస్తే అద్దంలో ముఖం అంతా వంకరగా కనబడింది. దాన్ని వెనక్కి తీసుకెళ్ళాడు దుకాణానికి-

వెంగళప్ప: ఏంటయ్యా! ఈ అద్దంలో నా ముఖం కాక వేరో ఎవరిదో కనబడుతోంది?

షాపతను: ఇంతకు ముందు మీలాంటాయనే ఒకాయన దాన్ని కొనుక్కెళ్ళి , వెనక్కి తిరిగిఇచ్చాడు సార్! పొరపాటున ఈ అద్దం ఆయన ముఖాన్నే చూపిస్తున్నట్లున్నది, మీకు కూడా!

వెంగళప్ప: సర్లే, వెనక్కిచ్చెయ్యి. పోయిన మా తమ్ముడి గుర్తుగా దీన్ని నేనే వాడుకుంటాను. ఇంతకు ముందు దీన్ని తీసుకెళ్ళింది వాడే అయిఉంటాడు,పాపం.

సేకరణ: G. సుచరిత

చదువు

రచన: P.భాగ్య లక్ష్మి, 9 వ తరగతి, ప్రకృతిబడి, చెన్నే కొత్తపల్లి, అనంతపురం జిల్లా.

అనగా అనగా ఒక ఊళ్లో రాము అనే పిల్లవాడు ఉండేవాడు. అతను బాగా చదువుకుంటాడని పేరు. అతను ఒకసారి ప్రక్క ఊరికి పనిమీద వెళ్ళాడు. ఆ ఊళ్ళో అతనికి తండ్రీ-కొడుకులు ఇద్దరు పరిచయం అయ్యారు. వాళ్ళిద్దరూ ఆ ఊళ్ళో కూలి పని చేసి, సాయంత్రంగా తమ ఊరికి బయలు దేరారు.

రాముకూడా తన పని పూర్తయ్యాక ఇంటికి బయలుదేరాడు. అయితే అతనికి బస్సులో ఆ తండ్రీకొడుకులే కనబడ్డారు మళ్ళీ!

ముగ్గురూ ఆనాటి విశేషాలు అవీ ముచ్చటించుకున్నాక, రాము అడిగాడు వాళ్లని- "ఇంతకీ ఏ ఊరు వెళ్తున్నారు పెద్దయ్యా, మీరు?" అని. "చెన్నేకొత్తపల్లి పోవాలబ్బా!" అన్నారు వాళ్ళు. "అయ్యో, పెద్దయ్యా! ఇది చెన్నేకొత్తపల్లికి వెళ్ళే బస్సు కాదే!

ఆ బస్సు ఇందాకే వెళ్ళిపోయింది కదా! మళ్ళీ రెండు గంటల వరకూ మరో బస్సు లేదు. నువ్వు నీ కొడుకుని చదివించే ఉంటే ఈరోజు మీకు ఈ పరిస్థితి ఎదురయ్యేది కాదుగదా! దిగండి, ఇంకొంచెం సేపు అక్కడే కూర్చోండి- ఏంచేస్తాం?" అన్నాడు రాము వాళ్ళతో.

వాళ్ళిద్దరూ మారు మాట్లాడకుండా బస్సు దిగి నడుచుకుంటూ వెనక్కి పోయారు. ఆరోజు ఇంటికి చేరుకున్నాక, తండ్రికి నిద్ర పట్టలేదు. "మావాడిని కూడా చదివించి ఉంటే మాకు ఈ పరిస్థితి ఎదురయ్యేది కాదు, నిజమే!" అనిపించసాగింది ఆయనకు. "రేపటినుండీ వాణ్ణి బడికి పంపి చదివిస్తాను-" అని నిశ్చయించుకున్నాడాయన.

అనుకున్నట్టుగానే తర్వాతి రోజునుండీ కొడుకును బడికి పంపి బాగా చదివించాడు. ఆ పిల్లవాడు కూడా మనసు పెట్టి చదివాడు. పెద్దయ్యేసరికి మంచి డాక్టరయ్యాడు.



పెద్దయ్యాక రాము వ్యాపారంలోకి దిగాడు. అయితే అతని ఆరోగ్యం అస్సలు బాగా లేకుండింది. అతనొకసారి కళ్ళు తిరిగి పడిపోయేసరికి, ఇంట్లోవాళ్ళు కంగారు పడి అతన్ని ఆసుపత్రికి తీసుకెళ్ళారు. రాము చాలానే మారాడు- అయినా తండ్రీ కొడుకులిద్దరూ అతన్ని గుర్తుపట్టారు. అతన్ని తమ ఇంట్లోనే ఉంచి వైద్యం చేసి, బాగా చూసుకున్నారు.

బాగయ్యాక, రాము వాళ్లకు డబ్బులివ్వబోతే

వాళ్ళు తీసుకోలేదు- "నువ్వు మాకు చేసిన సాయం ముందు ఇది ఏపాటిది? ఆరోజు నువ్వు గనక మాకు చదువు గురించి చెప్పకపోతే మేం ఏమై ఉండేవాళ్లం?" అన్నారు డాక్టరు గారు రాముకి కృతజ్ఞతలు చెబుతూ!

క్రికెట్ పిచ్చి! జోకు

షాహీద్ అఫ్రీదీ వాళ్ల అమ్మ : ఒరేయ్ అఫ్రీదీ! సంతకు వెళ్లి కూరగాయలు తీసుకురారా!

అఫ్రీదీ: వరల్డ్‌కప్‌లో ఓడిపోయామని జనం మామీద కోపంగా ఉన్నారమ్మా! కనబడితే కొడతారేమో.

అఫ్రీదీ వాళ్ళ అమ్మ: మరేం ఫర్వాలేదురా, వాళ్లకోసం మన పనులు ఆపుకుంటామా? చీర కట్టుకుని వెళ్లు- ఎవరూ గుర్తుపట్టరులే.

[అఫ్రీదీ చీర కట్టుకొని సంతకు వెళ్తాడు- అక్కడ..]

అక్కడొకామె ఆపింది అఫ్రీదీని : హాయ్ అఫ్రీదీ, ఎలా ఉన్నావ్?

అఫ్రీదీ (ఆశ్చర్యంగా): ఆఁ! నేను అఫ్రీదీ నని ఎట్లా తెలిసింది, నీకు?

ఆమె: ఓరి, నీ- నేనురా, యూనిస్ ఖాన్‌ను!

సేకరణ: G. సుచరిత

(పిల్లల్లోవినబడుతున్నఈ జోకులోగర్వం, అతిశయంకొంచెంఎక్కువగానేఉన్నై.. పాఠకులుసహృదయంతో అర్థంచేసుకుంటారనిఆశిస్తూ..).

కాకి

రచన: శ్రీమతి ఆదూరి హైమవతి, విశ్రాంతప్రధానోపాధ్యాయిని, బెంగుళూరు.

పక్షులన్నింటికీ రాజైన గరుడపక్షి , తన ప్రజల నందరినీ సమావేశపరిచి, వాళ్ళ కష్టసుఖాలను విచారించ సాగింది: " ప్రియమైన పక్షులారా! మీరంతా మాపాలనలో సుఖంగా జీవిస్తున్నారని భావిస్తున్నాం . మీకేమైనా చెప్పుకోవలసింది ఉంటే సందేహించక చెప్పండి-" అన్నది.

"మహారాజా! మీ చల్లని పాలనలో మాకు ఏ ఇబ్బందులూ లేవు. పిల్లాపాపలతో మేం అందరం చాలా సుఖంగా జీవిస్తున్నాం " అన్నాయి అవి, ముక్తకంఠంతో .

"కానీ నేను అడిగేది- 'మీకేమైనా బాధలున్నాయా, చిన్నవో- పెద్దవో ' అని!" అన్నారు రాజుగారు.

"ప్రభూ! మాకోయిల జాతి చక్కగా పాటలు పాడుతూ అందర్నీ సంతోషపెడుతున్నది. మా పాట వినబడగానే 'వసంత కాలంవచ్చింది'అని

అంతా ఆనందిస్తారు. మేం కాకిలా నల్లగా ఉన్నాకూడా , అందరూ మమ్మల్ని ఇష్ట పడుతున్నది అందుకే . అయితే మాకున్న బాధల్లా- " అని ఆగింది కోయిల, 'చెప్పాలా, వద్దా' అన్నట్లు తటపటాయిస్తూ. "చెప్పండి, చెప్పండి- పర్వాలేదు" అని గరుడుడు భరోసా ఇచ్చాక అది కొనసాగించింది- " ప్రభూ! మా బాధల్లా 'కాకి మారంగులోనే ఉందేమి?' అని! భగవంతుడు నిజంగానే దయామయుడు- కనుక మాకు ఆయన కాకి గొంతు మాత్రం ఇవ్వలేదు , ఏదో పొరపాటున కాకి రంగు ఇచ్చాడు గానీ!" అన్నది, వెక్కిరింతగా, వెనకెక్కడో దూరంగా ఉన్నకాకిని అసహ్యంగాచూస్తూ.

"ఏం, చిలుకా, నువ్వేమీ చెప్పవా, మీ జాతి గురించి?" అన్నాడు గరుడుడు, ముందు కూర్చొని తల ఎగరవేస్తున్న చిలుకతో. "రాజా! మనుషులు పలికిన మాటలన్నిటినీ, ఉన్నవి ఉన్నట్లు తిరిగి పలుకుతున్నాం మేం; వాళ్ళకు మంచి స్నేహితులం. వాళ్ళ పిల్లలు ఎవరైనా ముద్దుగా మాట్లాడితే వాటిని 'చిలుక పలుకులు' అని అంటుంటారు! వాళ్ళు మాకు అరమాగిన పండ్లు తెచ్చి పెడుతుంటారు; వాళ్ళ తోటల్లో మేం కొరికిన పండ్లను, "అబ్బ! చిలుక కొరుకుడు!" అని సంతోషంగా తింటారు పిల్లలు. అందువల్ల మాకెవ్వరూ హానిచేయరు. పంచెవన్నెల రంగే మా అందం, మా ఆకర్షణానూ! మాకేమీ కష్టాలు లేవు" అన్నది చిలుక గర్వంగా.

" ప్రభూ ! మేం నెమళ్ళం, భారత దేశపు జాతీయ చిహ్నాలం. మనుషులు మమ్మల్ని ఎంతగానో గౌరవిస్తారు. మాఈకలు అద్భుతమైన రంగులతో అందంగా , ఆకర్షణీయంగా ఉంటాయి. మా ఈక లను అందరూ ఇళ్ళలో దాచుకుంటారు. మా నాట్యం చూస్తే ఎవరి హృదయాలైనా రంజిస్తాయి. పైగా మేం సుబ్రహ్మణ్యస్వామికి వాహనాలం- శ్రీకృష్ణుడు మాఈకల్ని తలమీద పెట్టుకుంటాడు. అందుకే మాకింత గౌరవం! మాకేం కష్టాలు?" అందినెమలి వయ్యారంగా.

గరుడుడు చిరునవ్వు నవ్వుతూ హంసవైపు చూశాడు. అది "మహాప్రభూ! మేం సరస్వతీ

దేవికి వాహనంగా బహుకాలం నుండీ ఉంటూ , ఆమెతో సరి సమానంగా గౌరవం పొందుతున్నాం.

పైగా మేం మిగిలిన పక్షుల్లాగా కనబడ్డ చెత్తనల్లా తినం- కేవలం తామర తూళ్ళే మాఆహారం. మమ్మల్ని, మా నడకల్ని చూశారు గదా? ఇంత నాజూకుదనం మాకు మాఆహారంవల్లే వచ్చిందని చెబుతుంటారు పెద్దలు. తెల్లని మా రంగును చూసి అసూయ పడనివాళ్ళు ఉండరు- మేం రాజపక్షులం, మాకేమీ కష్టాలుండవు" అన్నది సుతారంగా.

ఇట్లా పక్షులన్నీ ఒకదాని తర్వాత ఒకటి సొంత గొప్పలు చెప్పుకున్నై. మూలన కూర్చున్న కాకి మాత్రం ఏమీ పలకలేదు. చివరికి పక్షిరాజు కాకిని చూసి " ఏం, కాకమ్మా! నువ్వు మాట్లాడవేం? బాగున్నావా? నీకు కూడా ఇబ్బందులేమీ లేనట్లేనా?" అని అడిగింది.

"అది శనీశ్వరుడి వాహనం ! దానికేం ఇబ్బందులుంటాయి?! దాన్ని చూసి అందరూ భయ పడ వలసిందే! పైగా ఇది కుడినుండి ఎడమకు వెళ్తే జనం భయపడి తమ ప్రయాణాలు ఆపుకుం టారు. ఇక దానికి ప్రత్యేకంగా ఒక ఆహారం కావాలని ఏమీ లేదు- ఏది కనిపిస్తే దాన్ని ఆబగా తింటుంది. ఇంక దానికి తిండి బాధ ఎక్కడ?! " అని మిగిలిన పక్షులన్నీ నవ్వాయి. కాకి అవమానంతో, బాధగా తల వంచుకుంది.

ఈలోగా గరుడుడి పిల్లలు ఆవలిస్తూ "నిద్ర ముంచుకు వస్తోంది " అనడంతో "సరే మరి! ఇంతటితో మన సమావేశాన్ని ముగిద్దాం . వచ్చే పున్నమి రోజున అందరమూ కలుద్దాం మళ్ళీ. ఈలోగా మీరంతా మిమ్మల్ని మీరు కొంచెం పరిశీలించుకోండి. ఈ చర్చ ఇంకా కొనసాగాల్సి ఉంది" అని లేచింది , పక్షిరాజు.

***

మళ్ళీ పౌర్ణమి రానే వచ్చింది. రాజుగారి ఆజ్ఞ మేరకు, పక్షులన్నీ, నది ఒడ్డున- తెల్లని వెన్నెల్లో కూర్చున్నై.

గరుడుడు అన్నిటినీ చూసి "సరే, అంతా వచ్చినట్లేనా? ఇక సమావేశం మొదలెడదామా?" అనగానే పక్షులన్నీ తలలాడించాయి. "మనం మన జాతుల గొప్పతనం గురించి మాట్లాడుకుంటున్నాం; కాకి దగ్గరికి వచ్చి ఆగాం" గుర్తు చేశారు రాజుగారు. అయినా ఎవ్వరూ మాట్లాడలేదు.

"ఏమైంది, మీకు? ఎవ్వరూ మాట్లాడరేమి?" అడిగాడు గరుడుడు . అయినా సభంతా మౌనంగానే ఉండిపోయింది. రాజు గారు నవ్వి, "రామ చిలుకా !నువ్వు మొదలెట్టు- కాకి జాతి ఎందుకంత హీనమైనదో చెప్పు" అని హుకూం చేశారు. అది కళ్ళ నీళ్ళు పెట్టుకొని "ప్రభూ! మన్నించండి! పోయినసారి మా జాతి గురించి నేను చాలా పొగరుగా మాట్లాడాను. కాకి గురించి చాలా దురుసుగా మాట్లాడాను. ఈ మధ్యే నన్ను పట్టి పంజరంలో బంధించాడు ఓ మనిషి! కనబడ్డ పక్షికల్లా నేను నా గోడు వినిపించుకున్నాను. అయినా ఎవ్వరూ నా సాయానికి రాలేదు. చివరికి ఈ కాకే, నా దగ్గరికి వచ్చి, తన గట్టి ముక్కు తో పంజరం తలుపు తీసి నన్ను కాపాడింది . లేకపోతే జీవితాంతం ఆ పంజరంలో బందీగా, స్వేచ్ఛ లేని బ్రతుకు బ్రతకాల్సి వచ్చేది . ఇంతకు ముందు దీన్ని నేను ఎంత ఎగతాళి చేసినా, అది మాత్రం చెడును మనసులో పెట్టుకోకుండా నన్ను కాపాడింది. ఈ కాకి రుణం తీర్చుకోలేనిది" అని నమస్కరించింది చిలుక.

అంతలో నెమలి- "ప్రభూ ! నేనుకూడా పోయినసారి కాకిని ఎగతాళి చేసిన వాళ్లలో ఉన్నాను. అయితే మొన్ననే నేను ఒక వలలో చిక్కుకున్నాను! ఎంత ఏడ్చానో చెప్పలేను.

చివరికి ఈ కాకే, నా ఏడుపును విని, నన్ను ఓదార్చి, తన స్నేహితుడైన ఒక ఎలుకను తెచ్చి, వలను కొరికించి, నన్ను కాపాడింది. లేకపోతే నేను ఆ దుర్మార్గ మానవులకు చిక్కిపోయేదాన్ని. నా మాంసమంటే వాళ్లకు చాలా ఇష్టమట! నాకే అందమైన ఈకలు ఉన్నాయని గర్వంగా మాట్లాడాను- అయితే అవే నా ప్రాణాలకు ఎసరు తెస్తాయని తెలుసుకోలేదు నేను. ఒట్టి ఈకల అందమే తప్ప, నోరుతెరిచామంటే ఎవ్వరూ మాకంఠం వినలేరనే సంగతి మర్చిపోయి ప్రవర్తించాను" దీనంగా అన్నది నెమలి.

"మహారాజా! వారం రోజుల క్రితం నేను ఎప్పటి మాదిరే నదిలో ఈదుతూ తామర తూళ్ళకోసం వెతుక్కుంటున్నాను. నన్ను పట్టుకోవటం కోసం పడవలో వెంబడిస్తున్న మనుషులను నేను గమనించనే లేదు. ఈ కాకి తన అరుపులతో నన్ను హెచ్చరించకపోతే నేను ఆ మనుషుల పాల పడేదాన్ని. గొప్పమనస్సు గల ఈ కాకిని నేను అంతలేసి మాటలన్నందుకు ఇప్పుడు క్షమాపణ కోరుకుంటున్నాను " అని కాకివైపు తిరిగి నమస్కరించింది హంస.

"మహాప్రభూ! నేను దాని రంగు గురించే కాక, దాని స్వరాన్ని గురించికూడా ఎత్తిపొడిచి, కాకిని చిన్నబుచ్చాను. నాపాట గొప్పగా ఉంటుందని ఏమేమో చెప్పాను; కానీ ఈ కాకమ్మ తన గుడ్లతో పాటు మాగుడ్లను కూడా పొదిగి ఇస్తున్నదని మరచాను . అంతేకాక, నిన్న నామీద వల విసిరి నన్ను పట్టుకునేందుకు ప్రయత్నించిన మనుషుల్ని ఈ కాకమ్మే, తన ముక్కు తో పొడిచి, వాళ్ళ గురి తప్పి పోయేలా చేసి, నన్ను కాపాడింది. దానికి వేలవేల కృతజ్ఞతలు " అన్నది కోయిల, సిగ్గుతో తలదించుకొని.

గరుడుడు చిరునవ్వు నవ్వి, "పక్షులారా! మీరంతా మీ మీ తప్పుల్ని తెలుసుకొని, కాకిని గౌరవించటం నాకు చాలా సంతోషం కలిగించింది. పక్షి జాతిలో కాకిది చాలా ప్రత్యేకమైన స్థానం. అది పరిసరాలను శుభ్రం చేసే గొప్ప పక్షి. దాని రంగును, అరుపును, శరీర నిర్మాణాన్ని ఎత్తిచూపి అంతటి పక్షిని చిన్నబుచ్చటం నిజానికి, మీ అందరి

చిన్నతనమే. సరిగ్గా చూస్తే పక్షిజాతికి ప్రధాన శత్రువు మనిషే- ఈపాటికి ఆ సంగతి మీకు అర్థం అయ్యే ఉంటుంది. పక్షులన్నీ ఒకటిగా ఉండకపోతే మనుషుల ఈ ప్రపంచంలో వాటి మనుగడ కష్టమే!" అన్నాడు.

పక్షులన్నీ అంగీకారంగా తలలూపాయి. తమలో తాము పోట్లాడుకోవటం వల్ల బయటివాళ్లకు లోకువ అవుతామని అవన్నీ గుర్తించాయి. తమ విభేదాలను ప్రక్కన పెట్టి నిజంగా కలిసి బ్రతకాలని నిశ్చయించు-కున్నాయి.

స్నేహ పరీక్ష! **జోకులు**

కుమార్: కష్టాలే స్నేహానికి నిజమైన పరీక్షరా! ఎవరు ఎంతటి స్నేహితులో కష్ట సమయంలోనే తేలుతుంది.

శ్రీకాంత్: మా అబ్బాయిని హాస్పిటల్‌లో చేర్పించానురా, ఓ వెయ్యిరూపాయలు సర్దు చూద్దాం!

టైం పాస్!

భార్య: ఎప్పుడూ ఆ సెల్‌ఫోన్ పట్టుకొని తిరుగుతారేంటండీ, సెల్‌ఫోన్ల వల్ల ఆరోగ్యం పాడవుతుందట!

భర్త: ఏం చెయ్యమంటావే, డాక్టరు గారి నంబరు ఈ సెల్‌ఫోన్లోనే ఉంది మరి!

సేకరణ: G. సుచరిత

పారిన ఉపాయం

రచన: శ్రీమతి రాధ మండువ, ఉపాధ్యాయిని, రిషివ్యాలీస్కూల్, మదనపల్లి, చిత్తూరు జిల్లా.

మండువవారిపాలెంలో నారాయణయ్య, లక్ష్మమ్మ అనే బ్రాహ్మణ దంపతులు ఉండేవారు. నారాయణయ్య ఆ ఊరి గుళ్ళో పూజారి. సాధుస్వభావి. ఎప్పుడూ పూజలూ, వ్రతాలూ, ఉపవాసాలూ, పురాణ కాలక్షేపాలతో తన జీవితాన్ని గడిపేవాడు. భార్య లక్ష్మమ్మ కూడా ఆయనకు తగినట్లుగా నడుచుకునేది. అయితే ఎన్ని నోములు నోచినా వాళ్ళకు పిల్లలు మాత్రం పుట్టలేదు.

ఒక రోజున భార్యతో అన్నాడు నారాయణయ్య- "లక్ష్మీ! మనకా, పిల్లలు లేరు. పున్నామ నరకం నుండి తప్పించుకోవడానికి రోజూ ఒక బ్రాహ్మణుడికి భోజనం పెడదాం" అని.

"మనకే జరగడం లేదు. అతిథులకు మనం ఏం పెట్టగలమండీ!" అంది లక్ష్మమ్మ.

"ఉన్న దాంట్లోనే సర్దుకుందాం. ఏది ఏమైనా

సరే, మనం మాత్రం రోజుకొకరికి భోజనం పెట్టాల్సిందే. నేను వెళ్ళి ఇవాల్టి అతిథిని తీసుకువస్తాను. నువ్వు భోజనం సిద్ధం చెయ్యి" అంటూ బయటకు వెళ్ళాడు నారాయణయ్య- మధ్యాహ్నం అయ్యేసరికి ఎవరో అతిథిని వెంటబెట్టుకొని వచ్చాడు కూడానూ!

వరండాలో సిద్ధం చేసి ఉంచిన నీళ్ళతో కాళ్ళు కడుక్కుని ఇద్దరూ భోజనానికి కూర్చున్నారు. లక్ష్మమ్మ వడ్డించింది. భోజనం అయ్యాక తాంబూలం పుచ్చుకుని, దంపతులిద్దరినీ దీవించి వెళ్ళిపోయాడు అతిథి.

మరునాడూ ఇదే తంతు. ఇట్లా నెల రోజులు గడిచాయి. దాచుకున్న డబ్బంతా ఖర్చయిపోతోంది. ఖర్చు సంగతి అటుంచి, ప్రతిరోజూ విందు భోజనం సిద్ధం చేయలేక లక్ష్మమ్మ నానా అవస్థలూ పడుతోంది.

ఒక రోజున పచ్చడి నూరుకుంటూ "భగవంతుడా! నాకీ బాధ ఎప్పుడు తప్పుతుందో కదా, ఏమిటి ఉపాయం?" అనుకుంటూ రోటి వైపు, రోకలి వైపు చూసింది. వెంటనే ఆమె కొక ఉపాయం తట్టింది. సరైన సమయం కోసం, సరైన మనిషి కోసం ఎదురు చూడసాగింది.

బ్రాహ్మణ అతిథికోసం ఊళ్ళోకి వెళ్ళిన నారాయణయ్య ఒకరోజున పేరిశాస్త్రి అనేవాణ్ణి వెంటబెట్టుకు వచ్చాడు. పేరిశాస్త్రి నోట్లో నువ్వు గింజ నానదు. తనకు తెలిసిన విషయాన్ని ఊరంతటికీ చెప్తే గానీ నిద్రపోడు. అతన్ని చూడగానే లక్ష్మమ్మ తన పథకం అమలు చెయ్యాలని నిర్ణయించుకుంది-

కాళ్ళు కడుక్కొని భోజనానికి కూర్చోబోతున్న భర్తని పిలిచి- " ఏమండీ! ఇంట్లో నెయ్యి లేదు. త్వరగా సుబ్బయ్య కొట్టుకి వెళ్ళి నెయ్యి పట్రండి" అంటూ నెయ్యి గిన్నెని చేతికి అందించింది. నారాయణయ్య దొడ్డి దారిన అటు వెళ్ళగానే, ఇటు వంట ఇంట్లోంచి రోటినీ, రోకలి బండనీ భోజనాల గదిలోకి తెచ్చింది లక్ష్మమ్మ.

పేరిశాస్త్రి అదే గదిలో ఒక ప్రక్కగా -పీటమీద- కూర్చుని ఉన్నాడు . లక్ష్మమ్మ అతనితో ఏమీ మాట్లాడకుండా వెళ్ళి, గది మధ్యలో రోటినీ,

రోకలినీ ఉంచింది. వాటికి పసుపు రాసి, బొట్లు పెట్టి, పూజ చేసింది. వాటి చుట్టూ ప్రదక్షిణలు మొదలు పెట్టింది. పేరిశాస్త్రికి ఈ తంతు ఏమీ అర్థం కాలేదు - "ఏం చేస్తున్నావమ్మా?! ఎందుకు, వాటికి పూజ చేస్తున్నావు?" అని అడిగాడు ఆశ్చర్యంగా.

"ఆఁ, ఏమీ లేదు శాస్త్రిగారూ! మీరు ఏమీ అనుకోకండి! మాకు పిల్లలు పుట్టాలంటే మా ఇంటికి వచ్చిన అతిథులకు ఈ రోకలి బండతో గట్టిగా ఒక దెబ్బ వేయాలిట. ఇట్లా వంద మందికి వంద దెబ్బలు వేస్తే మాకు పండంటి బాబు కలుగుతాడట! అందుకని, మా వారు ఈ వ్రతం చేస్తున్నారు. ఆయన రాగానే మీరు మా మీద దయ ఉంచి, ఒక దెబ్బ వేయించుకోండి" అంది లక్ష్మమ్మ.

"అదేంటమ్మా! మీరు మంచి విందు భోజనం నెల్లాళ్ళ నుండీ పెడుతున్నారని ఊరంతా చెప్పుకుంటున్నారే, మరి!?" అన్నాడు పేరిశాస్త్రి, కొంచెం అనుమానంగా.

"పేరిశాస్త్రి గారూ! ఎవరైనా మా ఇంటికి వచ్చి దెబ్బలు తిని- 'దెబ్బలు తిన్నాము' అని చెప్పుకుంటారా, బయట!? అందుకేనేమో, అందరూ మిమ్మల్ని 'అమాయకులు' అనుకుంటారు పాపం!" బుగ్గలు నొక్కుకుంటూ అంది లక్ష్మమ్మ.

ఈలోగా నారాయణయ్య దొడ్డి వాకిట్లోంచి వచ్చే అలికిడి వినబడగానే, లక్ష్మమ్మ లేచి వంటింట్లోకి వెళ్ళింది. 'ఇదే సమయం, పారిపోవడానికి!' అనుకుని, పేరిశాస్త్రి తన చేతి సంచిని తీసుకుని ఒక్క అంగలో వీధి గుమ్మం చేరాడు.

అంతలోనే లోనికి వచ్చిన నారాయణయ్య అది చూసి లక్ష్మమ్మను- "అదేమిటే? శాస్త్రిగారు వెళ్ళిపోతున్నట్లున్నారు, ఎందుకు?" అని అడిగాడు గాభరాగా.

'ఆఁ, ఏమీ లేదండీ! ఆయనకి మన రోకలి బండ కావాలట. నేను ఇవ్వనన్నాను; కోపం వచ్చి- "మీ ఇంటి భోజనమూ అవసరం లేదు; మీ రోకలీ అవసరం లేదు!" అని లేచి వెళ్ళిపోతున్నారు" అంది లక్ష్మమ్మ, వంటింట్లోంచే.

"అతిథి ఏమి అడిగినా ఇవ్వాలని తెలియదా? పాపం ఎంత ముచ్చటపడి అడిగారో,

ఏమిటో!" అని రోకలిబండను చేతబట్టుకొని బయటికి వచ్చాడు నారాయణయ్య- "పేరిశాస్త్రిగారూ! ఇదిగోండి- రోకలి బండ! ఆగండి! ఇదిగో, అందుకోండి!" అంటూ, రోకలిని ఊపుతూ పేరిశాస్త్రి వెనకనే పరుగుతీశాడు.

అది చూసిన పేరిశాస్త్రి " వామ్మో! కొట్టడానికి వెంటపడుతున్నాడ్రోయ్! " అంటూ పరుగు లంకించుకున్నాడు.

నోరు ఆగని పేరిశాస్త్రి, తను కనుక్కున్న 'నారాయణయ్య ఇంటి రహస్యాన్ని' అందరికీ చెప్పేశాడు. రోకలి బండ చేతబట్టుకొని ఊపుతూ "ఆగండి! ఇదిగో, రోకలి!" అని అరుస్తూ నారాయణయ్య పేరిశాస్త్రి వెంట పడటాన్ని చూసిన జనం కూడా పేరిశాస్త్రి చెప్పిన కథను చిలవలు పలవలుగా చూడని వాళ్ళందరికీ చెప్పేశారు.

అటుపైన ఎంత వెతికినా నారాయణయ్యకు అతిథులు మాత్రం దొరకలేదు.

లక్ష్మమ్మకు అతిథుల బాధ తప్పింది!

మమ్మీ! **జోకు**

కొడుకు: మీరు ఈజిప్టు వెళ్లారా నాన్నా?

తండ్రి: లేదురా!

కొడుకు: మరి మీకు మమ్మీ ఎక్కడ దొరికింది?

సేకరణ: G. సుచరిత



పేరు మరచిన ఈగ

కథనం: చక్రి, సమాలోచన, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లా.

అనగనగ ఒక వూర్లో ఒక ఈగ ఉందంట. 'రేపు నూకాలమ్మ పండగ కదా, ఇల్లు గుమ్మాలు కడుక్కోవాలి' అనుకుని పని మొదలు పెట్టిదంట. అలాగ కడుగుతూ కడుగుతూ అలిసి పోయి, తన పేరు మరచి పోయిందంట. అయ్యో ఎలాగా అని గురుతు తెచ్చుకోవడానికి ప్రయత్నం చేసిదంట. పాపం అయినా గురుతుకు రాలేదంట! దాంతో 'సరేలే, ఎవరినైనా అడిగి తెలుసుకుందాం'అని బయలుదేరిందంట.

మొదట కోడిపిల్ల దగ్గరకు వెళ్లి అడిగింది- "ఓహ్

కోడిపిల్లా! నా పేరు నీకు తెలుసా?" అని అడిగింది. కోడిపిల్ల "కొక్కురోక్కో" అని ఈగ చెవిలో గట్టిగా కూసింది. దానితో ఈగ "నా చెవి బద్దలు ఐపోయింది బాబోయ్! అయినా నా పేరు కొక్కురోక్కో కాదు" అని అక్కడ నుండి పారిపోయింది.

అంతలో దానికి ఒక కుక్కపిల్ల కనిపించింది. "అబ్బ! ఎంతటి ముచ్చటయిన తోకో!" అని ఈగ ఈర్ష పడింది.

అంతలో వచ్చిన పని గురుతుకు వచ్చి- "ఏమండీ, కుక్కపిల్ల గారూ! నా పేరు ఏమిటో చెప్పగలరా?" అని అడిగింది. కుక్కపిల్ల చిరాకు పడింది. "అన్నం తినే హడావిడిలో నేనుంటే, ఈ ఈగ గోల ఏమిటో" అనుకొనింది. "బో బో" అని గట్టిగా మొరిగింది. దానితో ఈగ అక్కడ నుండి తుర్రుమంది.

"అమ్మయ్య" అని రొప్పుతూ ఒక చెట్టు మీద కూర్చుని సేద తీరింది. "అమ్మో ఇంక నా పేరు నాకు ఎప్పటికీ తెలీదేమో, యలాగా?' అని దిగాలు పడింది. అంతలో చెట్టు మీద కాకమ్మ ఈగను పలకరించింది- చెట్టు తొర్రలో ఉన్న పిల్లి మామ చాల తెలివైందని, దానిని అడగమని సలహా ఇచ్చింది.

దానితో ఈగ వెళ్లి పిల్లిని "నా పేరు ఏంటో తెలుసా, నీకు?" అని అడిగింది. "అయ్యో! నేను ముసలిదాన్ని అయ్యిపోయినానమ్మా! నాకు ఏమీ గుర్తుకు ఉండడం లేదు! అయినా పర్వాలేదు, ఆలోచిస్తాను- రేపు కనిపించు" అని అంది అది. దాంతో తన పేరు తెలుసుకో గలనన్న నమ్మకం ఈగకు పూర్తిగా పోయింది.

అంతలో దగ్గర్లో ఎక్కడో గోల గోలగా అనిపించి, అది అక్కడికి పరిగెత్తింది. అక్కడ చాలా- కోడి,కుక్క,పిల్లి,ఝుమ్మంటూ కందిరీగ,రోద చేస్తూ దోమ- ఇంకా చాలా మంది పోగై ఉన్నారు. వాళ్ళంతా అప్పుడే ఈనబోతున్న గేదె

వైపు చూస్తున్నారు. "నొప్పులు వోర్చుకో" అనీ, "అంతా మంచిగానే జరుగుతుందిలే" అని ధైర్యం నూరి పోస్తున్నారు. ఈగ కూడా తన పేరు గొడవ కాసేపు మర్చిపోయింది. 'ఎప్పుడు గేదె ఈనుతుందా, ఒక చిన్న దూడ పుడుతుందా' అని చూస్తుండగానే "హీ హీ" అని సకిలిస్తూ దూడ గేదె కడుపు లోనించి బయటకు వచ్చింది. అందరూ సంతోషంగా అరిచారు గానీ దూడమాత్రం 'హీ హీ' అని సకిలించడం ఆపడం లేదు.

అది విన్న ఈగకు తన పేరు 'ఈగ' అని గుర్తుకు వచ్చింది. "హమ్మయ్య" అనుకోని అది ఇంటి దారి పట్టింది.

పసిపిల్లలు

కవిత

రచన: జె.నవీన, 9వతరగతి, అభ్యాసవిద్యాలయం, విజయవాడ.

పాల బుగ్గల పసి పిల్లలు
వారు బంగారు పసి మొగ్గలు
అవినీతిని అరికట్టే ఆయుధాలు,
భావితరపు యోధులు
పసిపిల్లల మీదా, మీ ప్రతాపాలు?
ఏం చేశారని, వారి మీద చేస్తున్నారు అఘాయిత్యాలు?
పసిమొగ్గలను చంపి తీసుకుంటున్నారు డబ్బులు
పైన ఒకడంటూ ఉంటే, చూస్తున్నాడు మీ వేషాలు-
మిమ్మల్ని తప్పక చేస్తాడు- నరకంపాలు!

అమ్మ చెట్టు

రచన: శ్రీ బొమ్మిడి జగదీశ్వర రావు, హైదరాబాదు.

అమ్మ కొంగు పట్టుకుంది చిట్టి. చిట్టికి చిన్న పిలక జడ వుంది కదా, దాన్ని పట్టుకున్నాడు బుజ్జి. ఇంటి పనులతో యిటూ అటూ ఇంజన్లా తిరుగుతోంది అమ్మ. ఆ అక్కాతమ్ముళ్ళిద్దరూ అందమైన రైలు పెట్టెలై అమ్మకు అతుక్కుపోయారు. అమ్మ ఎటువెళ్తే అటు పరుగులు తీస్తున్నారు.

'కూ..చికు చుకూ..ఊ' .. అని బుజ్జిగాడు రైలు కూతని ఆపడం లేదు:

'చుక్ చుక్ రైలుబండి వస్తోంది
దూరం దూరం జరగండి
ఆగిన తర్వాత ఎక్కండి
జోజో పాపా యేడవకు
ఆగిన తర్వాత ఎక్కిస్తా
లడ్డూ మిఠాయి తినిపిస్తా'

పాట పాడుకుంటూ రైలు పరిగెడుతోంది. అమ్మ ఇంజను ఆగితే ఆగుతున్నారు. నడిస్తే

నడుస్తున్నారు, పరిగెడితే పరిగెడుతున్నారు.

అప్పుడు అమ్మ ఆగి, అంది..' నేనిప్పుడు బజారుకు వెళ్ళి వస్తాను, మీరిక్కడే స్టేషన్లో వుండండి..' అని! 'మేమో?..' అన్నాడు బుజ్జి వెంట పడబోతూ.

'పెట్టెలొచ్చేస్తే ఎవరైనా రైలు ఎలా ఎక్కుతారో చెప్పండి.' అని అమ్మ ఒక్కతే అవతలకు వెళ్ళింది. అమ్మకోసం చూస్తూ గుమ్మంలో అక్కా తమ్ముడు ఇంజను లేని పెట్టెల్లా అలాగే నిలబడ్డారు.

ఎప్పటికీ అమ్మ రాదే?!

ఇంతలో ఆకాశం గుడగుడమంది. ఉరుము ఉరిమింది మెరుపు మెరిసింది. అక్కా తమ్ముళ్ళిద్దరూ క్షణకాలం భయపడినా.. మరుక్షణం వీచే గాలితో పాటే చెలరేగి చిందులేసారు. ఎందుకంటే ఎండ వెలుగు పండువెన్నెల వెలుగయి పోయింది మరి! ఆకాశం నిండా మబ్బుల గొడుగు...

గొడుక్కి చిల్లులు పడ్డట్టు అప్పటికప్పుడు వర్షం మొదలైపోయింది. తుంపర తుంపర్లు చిటుకూ పటుకూ చినుకులయ్యాయి! జాన ఖాళీలేకుండా వాన!

వర్షంలోకి వెళ్ళబోయాడు బుజ్జి.

చిట్టి తమ్ముణ్ణి ఆపింది.

'వర్షం పడితే?.! బుజ్జిగాడిది సగం ప్రశ్న.

'వర్షం పడితే ....నేల తడుస్తుంది. నేల తడిస్తే మొక్కలు మొలుస్తాయి..' మొక్కలు చెట్లయిపోతాయి ' చిట్టి చెప్పిన విషయాలు బుజ్జిగాడికి అర్థం కాలేదు. అందుకే 'ఎవలు?' అన్నాడు.

'ఇంకెవలు? మా బడుందా? బడిలో సైన్సుందా? సైన్సుకి టీచరుందా? టీచరుకి పాఠముందా? ఆ పాఠంలో ఇదుందా?..' చిట్టి విడమర్చే చెప్పాననుకుంది.

'ఏది?' బుజ్జిగాడు అడిగాడు.

'ఇదే.. వర్షంలో తడిస్తే మొక్కవుతుంది ' అంది చిట్టి.

'ఎవలు?' అన్నాడు బుజ్జి.

చీకట్లు ముసురుకుంటూ.. వాన ముసుగు కప్పుకుంటూ.. కళ్ళకు ఏమీ కనిపించకుండా

వుంది.

'అమ్మా' అని పిలిచింది చిట్టి. గొంతు బొంగురు పోయింది. దు:ఖం ముంచుకొచ్చి 'అమ్మా' అని యేడ్చింది. అది చూసి బుజ్జిగాడి ముఖం వేళ్లాడిపోయింది.

వర్షం ఆగదు!

చిట్టి యేడుపూ ఆగదు!

'ఊకో అక్కా...' అని బుజ్జి ఆగడు!

చిట్టి వెక్కి వెక్కి యేడుస్తుంటే లోపల్నుంచి నాన్నారు వచ్చారు. 'ఏమయింది?' అని అడిగారు.

'అమ్మా..అమ్మా...' మాట రాకుంది చిట్టికి, కళ్ళు జలజలా నీళ్ళు కార్చాయి.

'అమ్మొస్తుంది చిట్టితల్లీ .. అమ్మొస్తుందమ్మా' అన్నారు నాన్నారు చిట్టిని దగ్గరకు తీసుకొని.

'అమ్మా వర్షంలో తడిచి పోతుందీ..దీ..ఈ..' యేడుస్తూ చిట్టి. 'ఊకో అక్కా వూకో..' అక్క కళ్ళు తుడుస్తూ బుజ్జి.

'అమ్మ తడిస్తే యేం?' అన్నారు నాన్నారు.

'అమ్మ తలిస్తే చెత్తయి పోతుందట నాన!, యేం చెత్తు అక్కా?' బుజ్జిగాడి అనుమానం బుజ్జిగాడిది.

ఆ మాటతో చిట్టి ఇంకా ఏడ్చింది. దాంతో బుజ్జిగాడూ యేడుపందుకున్నాడు. నాన్నారికి చెప్పే అవకాశం యివ్వలేదు. ఊరడించడమూ వల్లకాలేదు! జోరున వర్షం.. భోరున ఏడుపు!

ఇంతలో-

తడిసిపోయి నీళ్ళు కారుతూ అమ్మవచ్చింది.

చిట్టి ఠక్కున యేడుపు ఆపేసి.. ఒక్క క్షణం అమ్మను కింది నుంచి పైకి చూసింది.

మరుక్షణం 'అమ్మా!' అంటూ అమ్మ కాళ్ళను చుట్టేసి ఏడుపు అందుకుంది.

'ఏమైందమ్మా..?' అర్థం కాని అమ్మ అడుగుతోంది- చిట్టిని చేతులతో ఎత్తి పట్టుకొని.

నాన్నారు అమ్మతో చిట్టి ఎందుకేడుస్తోందో చెప్పారు.

అప్పుడు అమ్మ చిట్టిని నేలకు దించి, చిన్నగా నవ్వింది. చిట్టి కళ్ళలోకి చూస్తూ '..లేదమ్మాఁ.. వర్షంలో తడిచి, విత్తులు మొలకలు వేసి, మొక్కలవుతాయి. మనుషులు మొక్కలు కారమ్మా.. నేను చూడు... అమ్మనేఁ... మీ అమ్మనేఁ..' చెప్పింది.

చిట్టినే చూస్తూ వెన్నెల చిమ్మినట్టు చిన్న నవ్వు నవ్వింది అమ్మ.

అప్పటికి అనుమానం తీరిన చిట్టీ నవ్వింది. నవ్వుతూ ఏడ్చింది. ఏడుస్తూ అమ్మను చుట్టేసుకుంది.

నవ్వుతున్న నాన్నారివంక చూస్తూ బుజ్జి కూడా నవ్వాడు.

'జోజో పాపా ఏలవకు-

లద్దూ మిఠాయి తినిపిత్తా...' బుజ్జిగాడి పాటకు అమ్మా నాన్నతోపాటు చిట్టికూడా నవ్వేసింది!

పీత కష్టాలు పీతవి, సీత కష్టాలు సీతవి! జోకు

మొదటి వాడు: వాడు మాట్లాడనంటే అంత ఆందోళనపడతావేంట్రా?

రెండవ వాడు: వాడికి నేను లక్షరూపాయలు అప్పిచ్చానురా, మరి ఇప్పుడు మాట్లాడనంటే నేనేమైపోవాలి?

సేకరణ: G. సుచరిత



గమ్యం

రచన: శ్రీమతి నాగలక్ష్మి, ఉపాధ్యాయిని, KSR ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, అనంతపురం.

చుట్టూ పచ్చని పొలాలతో, చక్కని వ్యవసాయంతో ముచ్చటగొలుపుతూ ఉండేది గంగేపల్లి గ్రామం. ఊళ్ళో ప్రతి ఇంటి చుట్టూ ఒక తోట ఉండేది. ఇంట్లో వాడుకున్న నీళ్ళతోటే ఆ తోటలన్నీ పెరిగేవి. ఊరి అవసరాలకు కావలసిన కాయగూరలు, ఆకు కూరలు అన్నీ ఆ ఊళ్ళోనే పండేవి.

వాళ్ళ ఈ సౌభాగ్యానికి కారణం వాళ్ళు కొలిచే కప్ప దేవతలే అని ఊళ్ళో వాళ్లందరి విశ్వాసం. కప్పలకు పెళ్ళిళ్ళు చేస్తే వానలు పడతాయని వాళ్ల నమ్మకం. ఊళ్ళో ఎవ్వరూ కలలో కూడా కప్పలకు హాని తలపెట్టేవాళ్ళు కాదు. అలా ఆ ఊళ్ళో కప్పలు కుప్పలు తెప్పలుగా పెరిగిపోయినై.

ఊళ్ళో ఒక బుగ్గబావి ఉండేది. వందలాది ఎకరాల భూమికి సరిపడే నీళ్ళు ఊరుతుండేవి

అందులో. ఆ బావిలో ఎన్ని నీళ్ళున్నాయో అన్ని కప్పలు ఉన్నాయి- రోజూ తెల్లవారిందంటే వాటి బెక బెకలకు బావి చుట్టూ వేసిన వరలు విరిగిపడిపోతాయేమో అనిపించేది.

ఆ బావిలో నివసించేవి, కదిరప్ప-ముదిరమ్మ అనే కప్ప దంపతులు. తరతరాలుగా వస్తున్న కప్ప సాంప్రదాయాల్ని అవి తు.చ. తప్పకుండా పాటించేవి: ఆ బావిని విడిచి ఎక్కడికైనా వెళ్ళాలన్న ఆలోచన వాటికి ఏనాడూ రాలేదు. వాటి ప్రపంచం మొత్తం ఆ బావే.

అయితే వాటి పిల్లలు: కందినప్ప, వరదప్ప, మారెప్ప, చందనప్ప అనేవాటికి మాత్రం బావిలో రొదకు చెవులు పగిలిపోతున్నట్లు అనిపించేది. 'ఈ బావి అవతల ఇంకా చాలా ప్రపంచం ఉంటుంది- మనకు పెళ్ళిళ్ళు చేసే మనుష్యులు అక్కడే ఉంటారు- మనం అక్కడికి వెళ్ళి చూడాలి, ఒకరోజు- ఎలాగైనా మనవాళ్ళు చేసే ఈ రొదనుండి దూరంగా పారిపోవాలి' అనుకునేవి.

ఒక సారి విపరీతమైన గాలివాన ఒకటి వచ్చింది. గాలి తాకిడికి బావి అంచున ఉన్న వేపచెట్టొకటి, విరిగి, బావిలోకి పడి వ్రేలాడసాగింది. "చూశారా! బావి బయట వేరే ప్రపంచంఏదో ఉంది, చాలా పెద్దది! లేకపోతే ఇంత పెద్ద చెట్టు ఎక్కడినుండి పడుతుంది? దీన్ని పట్టుకొని ఎక్కి చూస్తే, పైన ఏముందోతెలుస్తుంది- రండి ఎక్కుదాం!" అన్నాయి ఆ నాలుగు కప్ప పిల్లలూ.

"మంచి ఆలోచన- నేను ముందు ఎక్కుతాను- మీరు ఆగండి-చూడండి" అని అరుచుకుంటూ అన్ని కప్పలూ ఒకదాన్నొకటి నెట్టుకుంటూ, త్రోసుకుంటూ చెట్టుకొమ్మమీదికి ఎక్కేందుకు

ప్రయత్నించాయి. వాటికి వేటికీ చెట్టెక్కడమే రాదు; అదీగాక నెట్టుకుంటున్నై- ఒకదానిని ఒకటి క్రిందికి లాగుతున్నై! ఇక ఎలాగ, ఎక్కేది? చివరికి అన్నీ అలసిపోయి, చతికిలబడ్డాయి.

అప్పుడు కందినప్ప ముందుకు వచ్చింది- అందరినీ ప్రక్కకు నెట్టి, తను చెట్టెక్క జూసింది- 'ఇంతమందిమి ఎక్కజూశాము; మాలో ఎవ్వరివల్లా కాలేదు; నీవల్ల ఏమౌతుంది?' అని ఎగతాళి చేసినాయి, మిగిలిన కప్పలన్నీ. కందినప్ప కుంగిపోయింది. వాళ్ళ మాటలకు లొంగి పోయింది. తన ప్రయత్నాన్ని విరమించుకున్నది.

ఇక వరదప్ప ముందుకు వచ్చింది. బడాయి మాటలు మాట్లాడింది. మిగిలిన కప్పలన్నిట్నీ చిన్నబుచ్చింది. వాటికి ఏమీ రాదన్నది- అన్నీతనకే వచ్చన్నది. బీరాలు పలికింది- 'ఒంటి చేత్తో చెట్టెక్కేస్తా, చూడండి' అన్నది- చెట్టెక్క జూసింది; ఎక్కలేక జారిపడింది.

'అయ్యో! ఇంతమంది ప్రయత్నించి విఫలులయ్యారే, ఇక నావల్ల ఏమౌతుంది?' అని నిరాశపడ్డది, చందనప్ప. ఆ నిరాశలో అది ఎక్కేందుకు ప్రయత్నించనే లేదు. ప్రయత్నించి ఉంటే అది ఎక్కగలిగి ఉండేది; కానీ ఆ సంగతి దానికి తెలీదు గద, అందుకని అది ప్రయత్నం చెయ్యనేలేదు!

వీళ్ళందరినీ జాగ్రత్తగా గమనించింది, మారెప్ప. 'ఎవరేమన్నా నిరాశ చెందగూడదు' అని మనసును గట్టి పరచుకున్నది; 'గొప్పలు చెప్పుకోను- నా శక్తి సామర్థ్యాలను పనిలోనే చూపుతాను' అని నిశ్చయించుకున్నది. ఎవ్వరితోటీ ఏమీ మాట్లాడలేదు- జాగ్రత్తగా కొమ్మను పట్టుకొని, మెల్లగా ఎక్కేసింది,

పైవరకూ! తాము ఇంతకాలమూ బ్రతికిన బావిని మించిన ప్రపంచం ఆ కొమ్మకు అవతల దాగుందని స్వయంగా తెలుసుకొనగలిగింది అది. తమను ఇంతకాలంగా పీడించిన రొద నుండికూడా విముక్తిపొందగలిగింది!

మనం నివసించే ఈ ప్రపంచం చాలా పెద్దది- ఊరికే బావిలో కప్పలమాదిరి జీవించకుండా, మనల్ని అన్నివేళల్లోనూ ప్రభావితంచేసే అంశాలను పరిశోధించి తెలుసుకోవాలి. ఆ ప్రయత్నంలో ఎవరు ఎన్ని మాటలాడి నిరాశ పరచాలని చూసినా, మనం మన ప్రయత్నాన్ని వీడకూడదు- మన గమ్యాన్ని మరచిపోకూడదు.

బాల్యం **కవిత**

రచన: పూజాభవాని, 9వతరగతి, అరవిందహైస్కూల్, కుంచనపల్లి, విజయవాడ.

పాలబుగ్గలతో,
తామరపూచేతులతో,
కలువపూలకన్నులతో,
నాటినుండిఈనాటివరకూ-
అన్నీతీపిజ్ఞాపకాలే..
అమ్మచేతిగోరుముద్దలు,
నాన్నముద్దుముచ్చట్లు,
అక్కతోఆటలు, అన్నతోగొడవలు,
అందరిచేతాతిట్లు,
నాఅమాయకత్వపుమాటలు-
టీచర్లనుమెచ్చుకోవటం,
వాళ్లనేవిమర్శించటం-
ఏమీతెలీకపోయినాఅన్నీతెలిసినదానిలావ్యవహరించటం
ఎంతమధురం, నాయీబాల్యం!

గులాబీ గర్వభంగం

తెలుగు అనుసరణ: డా.సుధారాణిపట్రాయని, http://www.illalimuchatlu.blogspot.com

అడవిలో ఒక శుభోదయాన ఒక చక్కని ఎర్రగులాబీ వికసించింది.

ఆ అడవిలో రక రకాల మొక్కలు, చెట్లు- ఎన్నో ఉన్నాయి.

వికసించిన ఎర్రగులాబీ అందాన్ని చూస్తూ ఒక పైన్ చెట్టు అన్నదట–

“అబ్బ !! ఎంత అందమైన పువ్వు....నాకే అంతటి అందం ఉంటేనా!....”అని.

“ఏంచేస్తాం, చెప్పు! మనం కోరుకున్నంత మాత్రాన అన్నీ మన సొంత కావుగా!..” అంటూ మరో చెట్టు దాన్ని ఓదార్చిందట.

గులాబీకి చాలా సంతోషం వేసింది- "చూడబోతే ఈ అడవిలో నా అంత అందమైన మొక్కే ఎక్కడా లేనట్టుందే..." అని బయటికే అనుకుంటూ మురిసిపోయింది గులాబీ.

ఈ లోపల, సూర్యకాంతం మొక్కలోంచి

పసుపు పచ్చ రంగు ముఖం ఒకటి, ఎర్రగులాబీ వైపు చూసి ఇలా అంది-

"అట్లా ఎందుకు అనుకుంటున్నావ్? ఈ అడవిలో అందమైన పూలు బోలెడున్నై! వాటిలో నువ్వు కూడా ఒకటి, అంతే!" ఈ మాటలు వినగానే గులాబీకి కోపం వచ్చేసింది. ఆ కోపంలో అది మరింత ఎర్రబడింది-

"ప్రతివాళ్ళూ నావైపు ఎంత ఆరాధనగా చూస్తున్నారో చూడు....నా అందం వాళ్ళని ఎంతగా ఆకట్టుకుంటోందో చూడు...!" అన్నదది, గర్వంగా.

గులాబీ పువ్వు అలా హుందాగా తల తిప్పుతూ, తన చుట్టూ ఉన్న తీగల్ని, మొక్కల్ని, చెట్లనూ- అన్నిటినీ గమనిస్తోంది. అలా చూస్తూంటే దాని దృష్టి తన పక్కనే ఉన్న నాగజెముడు మొక్కమీదపడింది-

"అబ్బ! ఏం మొక్కబాబూ, ఇది! ఒళ్ళంతా ముళ్ళే!! ఎంత అసహ్యంగా ఉందో..!" అని బిగ్గరగా అంటూ చీదరించుకుంది.

పైన్ చెట్టు ఇదంతా చూస్తూనే ఉంది-

"ఎర్రగులాబీ ! ఏమిటమ్మా ఈ మాటలు? తప్పుకదూ?! అందం అంతటా ఉందమ్మా. నీకు మాత్రం లేవూ ముళ్ళు?" అంటూ గులాబీ బాలను అది మందలించింది.

గర్వం తలకెక్కిన ఎర్రగులాబీ తల పొగరుగా ఊపుతూ పైన్ చెట్టును చూస్తూ-

"ఓహో!.అలాగా! మీకు గొప్ప అభిరుచి ఉందని అనుకున్నానే. అందం అంటే అసలు మీకు తెలీనే తెలీదన్నమాట! నా ముళ్ళు, ఆ నాగజెముడు ముళ్ళూ ఒకటేనా?! అదెక్కడ, నేనెక్కడ?!" అంది పొగరుగా.

ఎర్రగులాబీ మాటలు వింటున్న చెట్లన్నీ దాని పొగరును చూసి ఆశ్చర్యపోయాయి.

ఎర్రగులాబీకి తను ఉంటున్న ప్రదేశం ఏమాత్రం నచ్చలేదు. మరీ ఆ ముళ్ళ మొక్క పక్కనే ఉండవలసిరావటం అసలే నచ్చలేదు దానికి.

ఆ ముళ్ళ ముళ్ళ నాగజెముడు నుండి దూరంగా పోదామనుకున్నదది. తన వేళ్ళను బలంగా లాగేసుకుని, దానినుండి దూరంగా జరుగుదామని ఎంతో ప్రయత్నం చేసింది. కానీ

ఏమీ లాభం లేకపోయింది- ఒక్క అంగుళం కూడా కదల్లేకపోయింది.

ఎర్రగులాబీకి ఉక్రోషం ముంచుకొచ్చింది. 'తను నాగజెముడును ఏమీ చేయలేదు' అని అర్థమైపోయింది దానికి. ఇప్పుడు ఇక దాన్ని సూటిపోటి మాటలతో హింసించడం మొదలు పెట్టింది-

"ఛీ....ఏం మొక్క, ఇది?! దీనివల్ల ఎవరికి మాత్రం ఏం ఉపయోగం ఉంది?

ఓ పువ్వా...కాయా!? పైగా కంపరం పుట్టేట్లు, ఒళ్ళంతా ముళ్ళే!హుఁ-

నాలాంటి అందమైన మొక్కకు దీని పొరుగున ఉండవలసి రావటం! -ఎంత దురదృష్టం!" అని సణుగుతోంది గులాబీ.

నాగజెముడు వల్ల ఏ తప్పూ జరగలేదు- అయినా గులాబీ ఊరికే దాన్ని అట్లా ఆడిపోసుకుంటూనే ఉన్నది. అది ఎంత తిట్టినా గానీ, అది మాత్రం పాపం అస్సలు కోపగించుకోలేదు- పైపెచ్చు, 'భగవంతుడి సృష్టిలో ఏదీ నిరర్థకం కాదు. ప్రతిదానికి ఏదో ఒక ప్రయోజనం ఉంటుంది' అని గులాబీకి చెప్తూ ఉండేది.

***

వసంతకాలం గడిచిపోయింది. వాతావరణంలో వేడి ప్రారంభమైంది. అడవిలో జీవితం చాలా కష్టం కాసాగింది.

జంతువులు, మొక్కలు వేసవి వేడికి తట్టుకోలేక అల్లల్లాడాయి. ఒక్కవాన పడితే బాగుండునని తపించిపోయాయి. ఒక్క నీటిచుక్క కోసం వేసారిపోయాయి.

ఎర్రగులాబీకి కూడా కష్టాలు ప్రారంభమయ్యాయి. పచ్చగా నవనవ-లాడుతూ ఉండేది గులాబీ- ఇప్పుడు అది వాడిపోవడం మొదలు పెట్టింది.

ఒక రోజు పిట్టలు కొన్ని వచ్చాయి. నాగజెముడు చుట్టూ చేరాయి. తమ ముక్కులని ఆ మొక్క లోకి గుచ్చి దేన్నో పీల్చుకున్నాయి. వెంటనే కొత్తజీవితం పొందినట్టుగా కిచకిచలాడుతూ సంతోషంగా ఎగిరిపోయాయి- ఇదంతా చూసింది, గులాబీ. దానికి ఆశ్చర్యం తో పాటు ఒక సందేహం కూడా కలిగింది-

"ఆ పిట్టలు నాగజెముడులో ఉన్న నీటిని తాగాయి" చెప్పింది పైన్ చెట్టు, గులాబీ అనుమానం అర్థమైనట్లు.

"అలాగా! పిట్టలు అలా ముక్కులతో గుచ్చి కన్నం పెడితే, మరి దానికి నొప్పెట్టదూ? బాధగా ఉండదూ?" అడిగింది గులాబీ.

"ఎందుకుండదూ. కానీ నాగజెముడుకు పిట్టలంటే చాలా ఇష్టం. అవి కష్ట పడితే తను భరించలేదు. అందుకే తనకి నొప్పెట్టినా, ఆ పిట్టల సంతోషం కోసం ఓర్చుకుంటుంది " చెప్పింది పైన్ చెట్టు.

గులాబీ ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవిచేసి అడిగింది- "నాగజెముడులో నీళ్ళు ఉంటాయా?" అని.

"అవును. కావాలంటే నువ్వు కూడా ఆ నీళ్ళు తీసుకోవచ్చు- దాన్ని అడిగితే తప్పకుండా సహాయం చేస్తుంది. ఆ పిట్టలతో చెప్పి, తనలోని నీళ్లను నీకు కూడా అందిస్తుంది"- అన్నది పైన్ చెట్టు.

గతంలో తను ఎలా ప్రవర్తించిందో గుర్తొచ్చి సిగ్గుపడింది, ఎర్రగులాబీ . 'దాన్ని అంతగా అవమానించి, బాధించాక- మళ్ళీ దాన్నే సహాయం కోరాలా?' అని తటపటాయించింది. కానీ ఏం చేస్తుంది పాపం?! నీళ్ళు లేక, ప్రాణం లాగేస్తూ ఉంటే, శరీరం అంతా ఎండిపోతూ ఉంటే-?

చివరకు నాగజెముడును సహాయం కోరనే కోరింది ఎర్రగులాబీ.

ఆ నాగజెముడు, పాపం- చాలా మంచిది. ఎర్రగులాబీ నోరు తెరిచి అడిగిందో లేదో- వెంటనే పిట్టలను పిల్చింది. తనలోని నీటిని పీల్చి ఎర్రగులాబీ వేళ్ళ దగ్గర పోయమని ఆదేశించింది వాటిని.

పిట్టలు నాగజెముడును గట్టిగా పొడిచి నీళ్ళను పీల్చాయి. ఆ నీళ్ళతో గులాబీ మొక్క వేళ్ళను

తడిపాయి.

గులాబీకి ప్రాణం లేచివచ్చింది. మళ్ళీ పచ్చబడింది అది. కొత్త ఊపిరి పోసుకున్నట్టు నవనవలాడింది.

దానికి బుద్ధి వచ్చింది.

అంతేకాదు-

'బాహ్యసౌందర్యం కన్నా అంతఃసౌందర్యం గొప్పది' అని దానికి అర్థమయింది

కాలం విలువ! **జోకులు**

కొడుకు: మన గడియారం అమ్మితే ఎన్ని డబ్బులొస్తాయి నాన్నా?

తండ్రి: ఒక వంద రూపాయలు వస్తాయేమోరా, ఎందుకు, అట్లా అడుగుతున్నావ్?

కొడుకు: ఏంలేదు, మా టీచర్ టైం ఈజ్ మనీ అంటేనూ- ఎంత మనీనో అర్థం కాలేదు. వందరూపాయలేనన్నమాట!

సూరి-నా ఫ్రెండ్!

రవి: సూర్యుడు చాలా మంచి వాడు-

హరి: ఎందుకురా?

రవి: వేసవి సెలవులు ఇప్పిస్తాడు కాబట్టి!

సేకరణ: G. సుచరిత

కాపాడండి!

రచన: నారాయణ, కొత్తపల్లి బృందం.

అమెరికాలోని శాన్‌ఫ్రాన్‌సిస్కో నగరంలో..

2030 మే 1 వ తేదీ మధ్యాహ్నం...

పీటర్, వాళ్ల చెల్లి హైడీ ఇద్దరూ సముద్ర తీరానికి బయలు దేరారు. పిల్లలు స్నానం చేసేటప్పుడు ప్రమాదాలు జరగకుండా అధికారులు అక్కడ వ్యవస్థలు ఏర్పాటు చేసి ఉన్నారు. సముద్రపు నీళ్ళు లోపలికి వచ్చేటట్లుగా లోతులేని చెరువులు తయారు చేసి ఉంచారు సముద్రం ప్రక్కనే- పిల్లలు స్నానం చేసేందుకూ, ఈత కొట్టేందుకూ వీలుగా.

నీళ్లను చూడగానే ఎగిరి గంతువేసి చెరువులోకి దూకింది హైడీ. పీటర్ కూడా సంతోషం పట్టలేక నీళ్ళలోకి దూకాడు. ఆ సంతోషంలో ఇద్దరూ గమనించనే లేదు- తమ వెనక ఏం జరుగుతోందో!

***

సరిగ్గా అంతకు పదేళ్ల క్రితం 2020 లో...

సముద్రతీరానికి దగ్గర్లోనే ఒక దట్టమైన అడవిలాంటి ప్రదేశం ఉన్నది. పేరుకి అడవే గానీ, అందులోకి ఎవ్వరికీ ప్రవేశం లేదు. పెద్ద గోడ, గోడమీద బిగించిన కరెంటు తీగలు, తలుపుల దగ్గర నిలబడ్డ గార్డులు, వాళ్ళ చేతుల్లో మెరిసే అత్యాధునిక ఆయుధాలు, 'అనుమతి ఉంటేనే లోనికి ప్రవేశం' అన్న బోర్డులు, ఇవన్నీ ఆ ప్రదేశాన్ని మామూలు జనాలనుండి వేరుచేసి పెట్టాయి. నిజానికి అది ఒక ప్రయోగశాల.

ఆ ప్రయోగశాలలో డాక్టర్ జాన్సన్ చాలా కాలంగా తీవ్రమైన పరిశోధన చేస్తున్నాడు- లక్షల కోట్ల సంవత్సరాల క్రితం ఈ భూమిని ఏలిన డైనోసార్లమీద. భూమి లోపలి పొరల త్రవ్వకాలలో లభించిన డైనోసార్ ఎముకల్లో ఒకదాని మజ్జను సేకరించి పరిశీలించిన డాక్టర్ జాన్సన్‌కు చాలా ఆశ్చర్యకరమైన సంగతి ఒకటి

తెలిసింది- ఆ మజ్జలో రెండు కణాల్లో ఇంకా జీవం ఉంది! వేలాది మృత కణాల నడుమన, ఆ రెండు కణాల్లో మాత్రం జీవం ఇంకా నిలచే ఉన్నది!

డాక్టర్ జాన్సన్ ఎంతో శ్రమకోర్చి ఆ కణాలను మిగిలిన కణాలనుండి వేరు చేశాడు. ఆధునిక శాస్త్ర విజ్ఞానాన్ని ఉపయోగించి, వాటికి సరిపోయే ఉష్ణోగ్రతను, ఆహారాన్ని అందిస్తూ ఓపికగా వేచిచూశాడు. త్వరలోనే ఆయన నిరీక్షణ ఫలించింది- ఆ కణాలు రెండూ పెరగటం మొదలు పెట్టాయి! మెల్లగా, వాటిలోని డియన్ఏకొక స్పష్టత ఏర్పడ్డది.. ఒక్కో కణమూ రెండైంది..ఆ రెండూ నాలుగైనాయి.. ఆపైన ఇక జీవం ఊహించలేనంత త్వరగా పరిణామం చెందింది. డాక్టర్ జాన్సన్ చూస్తూండగానే రెండు చిన్న డైనోసార్లు- పూర్తిగా-స్వతంత్రంగా కదలాడే జీవులు-తయారయ్యాయి!

డాక్టర్ జాన్సన్ ఈ విషయాన్ని బయటి ప్రపంచానికి తెలియనివ్వలేదు. తెలిస్తే ఏం జరుగుతుందో ఆయనకూ తెలుసు: ప్రభుత్వం ఆయన ప్రయోగశాలను స్వాధీనం చేసుకుంటుంది! ఇక తన ప్రయోగాలన్నీ మూతబడిపోతాయి! తన డైనోసార్లను తను ఇక చూడలేడు!

అయితే ఆ డైనోసార్లు రెండూ పెద్దవౌతున్నకొద్దీ డాక్టర్ జాన్సన్‌కు బెంగ పట్టుకున్నది. అవి ఇప్పుడు చాలా బలంగా తయారైనై. చాలా ఆహారం కావలసి వస్తున్నది. అంతేకాక అవి ఇప్పుడు తన మాట వినటంలేదు!



ఆయన ఆ బెంగలో ఉండగానే అనుకోని అనర్థం ఒకటి జరిగిపోయింది- డైనోసార్లు రెండూ ఆడుకుంటూ ఆడుకుంటూ ఆయన ప్రయోగశాలను పూర్తిగా ధ్వంసం చేసేశాయి. ఆ శిధిలాలలో కూరుకుపోయి డాక్టర్ జాన్సన్

మరణించాడు. ఆయన సహాయకులు వాటిని బంధించేందుకు ప్రయత్నం చేసేసరికి, అవి బెదిరిపోయి, వీరంగం సృష్టించాయి. సహాయకులంతా పారిపోవలసి వచ్చింది. ఇప్పుడు ఆ డైనోసార్ల ఆకలిని తీర్చేందుకు కూడా ఎవ్వరూ లేరు అక్కడ! దాంతో అవి వేగంగా పరుగెత్తుకుంటూ పోయి, ఆ 'అడవికి' ఉన్న ప్రహరీగోడను కూల్చివేశాయి. ఆపైన ఇక అడ్డే లేకపోవటంతో జనావాసాల్లోకి పరుగులు పెట్టాయి- ఆహారంకోసం వెతుక్కుంటూ!

వాటిని చూసి మామూలు ప్రజలందరూ కకావికలయ్యారు. వాటి అరుపులకు శాన్‌ఫ్రాన్సిస్కో నగరం మొత్తం దద్దరిల్లింది. అవి దారీ తెన్నూ లేకుండా పరుగెడుతుంటే, అడ్డు వచ్చిన భవంతులన్నీ కూలిపోయాయి. చివరికి అవి సముద్రతీరం చేరుకున్నాయి!

***

2030 మే 1వ తేదీ సాయంత్రం...

ఏవో అరుపులు వినబడితే వెనక్కి తిరిగిచూసిన పీటర్‌కు ఆశ్చర్యంతో నోటమాట రాలేదు. డైనోసార్లు! రెండు! ఒకటేమో, వాతావరణ కేంద్రం వెనక నిలబడి చూస్తోంది. ఒకటేమో, దీపస్థంభాన్ని చుట్టుకొని గర్జిస్తోంది, భీకరంగా. తామిద్దరూ తప్ప, అక్కడ మరెవ్వరూ నేలమీద నిలబడి లేరు! వాటిని నియంత్రించేందుకే కాబోలు, ఒక హెలికాప్టర్ వచ్చి ఆగి ఉన్నది. ఆకాశంలో యుద్ధవిమానం ఒకటి గింగిరాలు కొడుతున్నది. క్రేన్లు, పవర్‌హోలు వచ్చి ఉన్నై. వాటిలో కూర్చొని ఉన్న మనుషుల్ని చూసి, డైనోసార్లు రెండూ కోపంతో గర్జిస్తున్నై!

"హైడీ! చూశావా, డైనోలు!" అంటూ వెనక్కి తిరిగిన పీటర్‌కు హైడీ కనబడలేదు. ఆ సరికే ఆ పాప లేచి ఒక డైనోసార్ దగ్గరికి పరుగు పెట్టింది- ఆగమన్నట్లు చేతులు చాపి!

డైనోసార్ పళ్ళు సూర్య కిరణాల వెలుగులో మిలమిలా మెరుస్తున్నాయి. డైనోసార్లు రెండూ ఆ పళ్లను నూరుతూ అరుస్తుంటే దిక్కులు పిక్కటిల్లుతున్నై. "హైడీ! ఆగు! ప్రమాదం!ఇంకా ముందుకి పోకు! అది మింగేస్తుంది!"అని అరుస్తూ ముందుకు పరుగెత్తాడు పీటర్.

'హైడీని నమిలేద్దాం' అన్నట్లు ముందుకి

దూకింది డైనోసార్. "ఆగు" అని అరుస్తూ పీటర్ తన బొమ్మ తుపాకీని పట్టుకొని బెదిరించేందుకు ప్రయత్నించాడు. అంత పెద్ద డైనోసార్ బొమ్మ తుపాకీని పట్టించుకుంటుందా?! అది ముందుకి దూకి, నాలుకను బయటికి చాపి, హైడీని నాకింది- బరువుగా, తడిగా. ఆ ఊపుకి హైడీ క్రింద పడిపోయింది.

అంతలో ఏమైందో ఏమో- ఆ డైనోసార్ ఆగిపోయి హైడీ వైపు చూసింది. మళ్ళీ నాలుక చాపి హైడీని అద్దుకొని, ఎత్తి నేలమీద నిలబెట్టింది. నాలుకను నోటిలోపలికి జరుపుకొని, పళ్లన్నీ బయటపెట్టి, బిగ్గరగా అరిచింది. హైడీకి అర్థమైంది- అది తన స్నేహాన్ని కోరుకుంటోంది!

అంతలోనే పైనున్న విమానంలోంచి దూసుకు వచ్చిన మందు బుల్లెట్లు డైనోసార్లకు తగిలాయి బలంగా. ఒక్క నిముషంలో అంత పెద్ద జంతువులూ ఏదో నిద్ర ముంచుకొచ్చినట్లు తూగుతూ క్రింద పడిపోయాయి. "డైనో! ఓ డైనో!" అని ఏడుస్తూ వాటిని తడుముతోంది హైడీ. పీటర్ నిశ్చేష్టుడై నిలబడిపోయాడు. అంతలోనే అక్కడికి దూసుకు వచ్చిన అధికారులు వాళ్ళిద్దరినీ అక్కడినుండి పంపించేశారు.

ఒక అరగంటలో ఆ రెండు డైనోలనూ ఎవరికీ తెలియని ప్రదేశానికి తరలించేశారు.

తర్వాత ఒక సంవత్సరానికి పేరులేని వార్తా పత్రిక ఒకదానిలో మూలగా చిన్న వార్త ఒకటి ప్రచురితమైంది-"ప్రయోగాత్మకంగా సృష్టించిన డైనోసార్లు రెండు ప్రయోగశాలలోనే మరణించాయి- దీనితో డైనోసార్లను మళ్ళీ భూమిమీద తిరిగేటట్లు చెయ్యచ్చు అన్న ఆలోచన నెరవేరని కోరికే అని తేలిపోయింది" అని.

సాన్‌ఫ్రాన్సిస్కోలో విధ్వంసం సృష్టించిన డైనోసార్లను నిజంగా చూసినవాళ్ళు ఎవ్వరూ ఆపత్రికను చదవనేలేదు! వాళ్లంతా ఇంకా అవి ఎక్కడో ఒకచోట క్షేమంగా ఉన్నాయనే అనుకుంటున్నారు!

డుర్రుచ్చి

రచన: శ్రీ బాలాంత్రపు రజనీకాంత రావుగారు.

గానం, సౌజన్యం: ఫోరం ఫర్ చైల్డ్ సెంటర్డ్ ఎజుకేషన్, విజయవాడ.

చెట్లు కొట్టగా పాలు కారగా
నిన్ను కొట్టగా నీరు కారగా
చెన్నపట్నం డుర్రుచ్చి
డుర్రుచ్చి, డుర్రుచ్చి!

మట్టి కొట్టగా దుమ్ము రేగగా
నిన్ను కొట్టగా నేయి కారగా
విశాఖపట్నంవెర్రొచ్చి
వెర్రొచ్చి, వెర్రొచ్చి!

కొమ్మ కొయ్యగా పలుకు తేరగా
నిన్ను కొయ్యగా నిగ్గు తేరగా
కళింగపట్నం కిర్రుచ్చి
కిర్రుచ్చి, కిర్రుచ్చి!

ఉట్టి తొయ్యగా గట్టు చేరగా
నిన్ను తొయ్యగా ఊరు చేరగా
మచిలీపట్నం రేవొచ్చి,
రేవొచ్చి, రేవొచ్చి!



యాభై ఆరు!

రచన, గానం: 'కవికాకి' కే.శే. జైసీతారాం, కోగిర, అనంతపురం జిల్లా.



అ ఆ ఇ ఈ నేర్పండి అయ్యవారూ
హక్షదంక అక్షరాలు యాభైఆరు!

ఉయ్యాల జంపాల ఉఊ బుబూ
ఎక్కడ- ఏవీ ఎ ఏ ఐ
ఓహో ఓహో ఒ ఓ ఔ
అం మం మం మం మ!
అ: హహ్హహ్హహా!
"అ ఆ ఇ ఈ నేర్పండి"

కల కల లాడే గమ గమ లాడే
కఖ గ ఘ ఙ
చక చక నడిచే జర జర జారే
చఛ జ ఝ ఞ
"అ ఆ ఇ ఈ నేర్పండి"

టంటంటంటం-డండండండం

టఠడఢణ

తథితైతథితై-దధితోందధితోం

తథదధన

"అఆఇఈనేర్పండి"

పకపకనవ్వేబాలలము

పఫబభమ

యరలవయరలవ

గిరగిరయరలవ

గిరగిరగిరగిర

యరలవగిరగిర

శషసహక్ష!

"అఆఇఈనేర్పండి"

మీకు ఇంటర్నెట్ సౌకర్యం ఉందా? ఈ పుస్తకంలోని పాటల్ని మీరు ఇంటర్నెట్‌లో ఉచితంగా వినచ్చు; డౌన్లోడు చేసుకోవచ్చు కూడాను! సందర్శించండి: http://kottapalli.in

అక్షరాలలో ఉంది

రచన: శ్రీ వారణాసి వెంకట్రావు గారు, విజయవాడ
గానం: కుమారి దివ్యమీన, విజయవాడ.

అక్షరాలలో ఉంది
అనంతమైన శక్తి
విద్యాదీపం వెలిగించి
విజ్ఞాన కాంతులు వెదజల్లే
"అక్షరాలలో ఉంది"

అక్షరము-అక్షరము
అగును కలిపితే పదము
పదమూ పదముల సముదాయం
అదేకదా మరి కావ్యం?!
"అక్షరాలలో"

మూగమనసుకు కలుగు అక్షరం
గ్రుడ్డికనులకు వెలుగు అక్షరం
విద్యావిహీనమైన వానికి
విశ్వం అంతా శూన్యం
"అక్షరాలలో"

గండశిలలపై చరిత్రలున్నా
గ్రంథపు పుటల శాస్త్రాలున్నా
అనంతమౌ విజ్ఞాన వ్యాప్తికి
అక్షరాలే మూలం
"అక్షరాలలో"

పదరంగం-3

ఈ పదరంగం చాలా సులభం! దీన్ని పూరించి పంపండి. మీ పేరుతో బాటు మీ బడి పేరు, తరగతి తప్పక రాయండి. సరైన సమాధానాలు పంపిన పిల్లల పేర్లను పదరంగం-5 తో పాటు ప్రచురించగలం.

నిర్వహణ: దేవి, బెంగుళూరు.



ఆధారాలు:

అడ్డం:

1. వెన్నెల కాసే రోజు(3)
3. ప్రపంచం(2)
5. వత్తు లేని రవ్వ(2)
7. సూర్యుడు అస్తమించే దిక్కు(4)
8. జబ్బు(2)
10. శబ్దం(2)
11. సగంలో సగం(2)
12. గుంపు(2)

నిలువు:

1. జన్మదినం(5)
2. కారంగా ఉండే కాయ(3)
4. తెలుపు నలుపు చారల జంతువు(6)
6. తిరగబడిన పడవ(3)
9. గోవు(2)
10. సమానం(2)

పదరంగం-1 కి సమాధానం



బొమ్మకు కథ రాద్దాం!

నిర్వహణ: శ్రీమతి జి.లలిత, http://telugu4kids.com

ఈ బొమ్మను చూడండి- శివుడు, గణపతులు, ఇంకా ఎవరెవరో ఊరేగింపుగా వెళ్తున్నట్లున్నారు కదూ? కాదు- ఇవన్నీ చెక్క బొమ్మలే! వీటి గురించి ఒక చక్కని కథ ఉంది, మా దగ్గర. అయితే ఆ కథను చదవాలంటే మీరంతా మరో రెండు నెలలు ఆగాల్సిందే మరి! ఆలోగా ఒక పని చేయండి-

ఈ బొమ్మను చూసి మీకు తట్టిన కథను దేన్నైనా రాసి పంపించేయండి. బాగుంటే, మరి మీరు రాసిన కథనే అచ్చువేద్దాం- ఏమంటారు?

మా చిరునామా: కొత్తపల్లి, యం.ఆర్.వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి, అనంతపురం జిల్లా-515101, ఫోను:08559240222, ఇ-మెయిలు: team@kotttapalli.in

అ..ఆ..ఇ..ఈ!

అనగనగా ఒక ఊరు
ఆ ఊరికి పెద్ద గోవిందు
ఇరుగూ పొరుగూ అందరికీ
ఈతడె ఎంతో సహకారి
ఉత్తముడమ్మ గోవిందంటూ
ఊరంతా తెగ పొగిడేరు
ఎవరికి సాయం కావాలన్నా
ఏవేళైనా వస్తాడమ్మా !
ఐక్యతముఖ్యం అంటాడు
ఒంటరితనము వద్దంటాడు
ఓర్పుతొ నేర్పుతొ ఉంటూ తానె
ఔరా ఔరా ఔరా యనగా
అందరి మెప్పు పొందాడు !





-డా.యన్.మంగాదేవి

(జిలిబిలిపలుకులు)

Published by Narayana for Kottapalli Trust, Near M.R.O.Office, Chennekothapalli-515101, Ananthapur District, AP.
Ph:08559 240222 E-mail: team@kottapalli.in.

మంచి పుస్తకం:

సడాకో- కాగితం పక్షులు

గుర్తుంది కదూ-? అప్పుడు, చాలా సంవత్సరాల క్రితం ఆగస్టు 6 న- జపాన్‌లోని హిరోషిమా నగరంపైన అణుబాంబు పేలింది. ఎంతో మంది చచ్చిపోయారు. ఎందరో పేరు తెలీని భయంకర రోగాల బారిన పడ్డారు. ఆ తర్వాత, తొమ్మిదేళ్ళు గడిచాకకూడా ఆ ప్రభావం కనబడుతూనే ఉంది. సడాకో అనే చిన్నపాప కథ కూడా ఆ రోజునే మొదలైంది-

సడాకోకు కూడా మనందరిలాగానే ఆటలన్నా, పాటలన్నా చాలా ఇష్టం. స్కూల్లో పరుగుపందెంలో పాల్గొన్నప్పుడు ఆ పాపకు ఎందుకో, కళ్ళు తిరుగుతున్నట్లైంది. మళ్ళీ ఇంకోసారి కూడా అలాగే జరిగేసరికి, రెడ్‌క్రాస్ ఆస్పత్రికి తీసుకెళ్ళి అన్ని పరీక్షలూ చేయిస్తే తెలిసింది- అణు ధార్మికత ఆమెనూ వదల్లేదు- చిన్నారి సడాకోకు లుకేమియా- క్యాన్సరు!

ఆస్పత్రిలో చేరిన సడాకోకు స్నేహితులందరూ ధైర్యం చెప్పారు: ఆరోగ్యం సరిగా లేనివాళ్ళెవరైనా సరే, కాగితాల్ని మడిచి వెయ్యి కొంగ బొమ్మల్ని చేస్తేచాలు- వాళ్ళ ఆరోగ్యం కుదురుకుంటుంది- అంతే! 'సుజుకో' అనే పాప సడాకోచేత ఆ బొమ్మల్ని చేయించేందుకు పూనుకున్నది.. ఎలాగో ఒకలాగ స్నేహితురాలు బాగైతే చాలు కద!

ఒక్కో కాగితాన్ని అన్ని మడతలు పెట్టి పక్షి బొమ్మలు చేయటం కష్టంగానే ఉంది సడాకోకు. అయినా ఆశ..బ్రతుకుమీద ఆశ.. నవ్వుతూ, ఆరోగ్యంగా పరుగులు పెట్టాలనే ఆశ- సడాకో చేత కాగితపు కొంగల్ని చేయిస్తూంటుంది. 203..వాళ్ల స్నేహితులు ఆ కొంగల్ని ఆసుపత్రిగదిలో అంతటా వ్రేలాడదీశారు..346..408..490..502..546..644- పక్షులు పూర్తయ్యాయి.

తర్వాత కొంగలు చేయటానికి సడాకో లేదు. 1955 అక్టోబరు 25 వ తేదీన సడాకో చనిపోయింది.

ఆ పాప స్నేహితులు మిగిలిన 356 కొంగల్నీ చేసి, సడాకోతో పాటు పూడ్చి పెట్టారు. అప్పటినుండి ఈనాటి వరకూ- ప్రతి సంవత్సరం- జపాన్ లోని లక్షలాదిమంది పిల్లలు వేలవేల కాగితపు పక్షుల్ని తయారు చేసి, శాంతి చిహ్నాలుగా అన్నిదేశాల పిల్లలకోసం పంపిస్తూనే ఉన్నారు. అణుశక్తి ఎంత ప్రమాద భరితమో వివరిస్తున్నారు.

"ప్రపంచశాంతిని కోరుకుందాం " అనే శీర్షికన జనవిజ్ఞానవేదిక వారు ప్రచురించిన నాలుగు పుస్తకాల సెట్‌లో "సడాకో-కాగితపు పక్షులు" ఒకటి. తప్పకుండా చదవండి, మీరూ ఆలోచించండి.